
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:124 | Vol-01 ::: Issue-124
హైదరాబాద్ 05 డిసెంబర్ 2025, శుక్రవారం | Hyderabad 05 December 2025, Friday
పేజీలు: 8, వెల: రూ. 5/- | Pages: 8, Rs. 5/-




అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com


## స్నేహితుడు వచ్చేశాడు



### పుతిన్ కోసం ప్రోటోకాల్ పక్కన పెట్టిన మోదీ
### ప్రత్యేక విందు ఏర్పాటు చేసిన ప్రధాని
### ఒకే కారులో పుతిన్, మోదీ ప్రయాణం
### నేడు రాష్ట్రపతి తో పుతిన్ సమావేశం
### భారత్ - రష్యా ద్వైపాక్షిక అంశాలపై ప్రత్యేక భేటి
### రెండు దేశాల సంబంధాలు మరింత బలోపేతం: రాజ్ నాథ్



**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటన కోసం గురువారం సాయంత్రం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా పాలం విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆయనకు స్వాగతం పలికారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ మన దేశానికి రావడం ఇదే తొలిసారి. రెండు దేశాల 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో భాగంగా, మోదీ, పుతిన్ సమావేశం కానున్నారు.**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

అంతర్జాతీయంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు, పశ్చిమ దేశాల ఒత్తిడుల నడుమ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ లో శుక్రవారం సమావేశం కాబోతున్నారు. రెండు రోజుల అధికారిక పర్యటన కోసం గురువారం ఢిల్లీకి చేరుకున్న పుతిన్‌కు, ప్రధాని మోదీ స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి స్వాగతం పలికారు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి మోదీ చూపిన ఈ ప్రత్యేక చొరవ, రెండు దేశాల మధ్య ఉన్న స్నేహ బంధానికి అద్దం పట్టింది. విమానం దిగిన వెంటనే ఇద్దరు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. తరువాత ఇద్దరూ ఒకే కారు లో విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ దృశ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యానికి మించి ఇద్దరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధానికి, పరస్పర విశ్వాసానికి నిలువుటద్దంగా నిలిచింది.

...::: తరువాయి 3వ పేజీలో..

## పంచాయితీ రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేము

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన ఆరు పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, గురువారం తీర్పును వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని ప్రాంతాల్లో సైతం ఆయా కులాలకు వార్డు మెంబర్లు, సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించడంలో పొరపాట్లు జరిగాయని వారు పేర్కొన్నారు.రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులాల వ్యక్తులు లేకపోతే ఎన్నికలు నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలియజేసింది. ఎన్నికల సంఘం చేసిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది.



## సేవ్ ఆంధ్రప్రదేశ్ ప్లీజ్



### ప్రభుత్వ వైఫల్యాలపై మాజీ సీఎం జగన్ ఆగ్రహం
### ఆరోగ్యశ్రీని పూర్తిగా ఎత్తేశారని ఆందోళన

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే ఏపీని 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అనాల్సిన పరిస్థితి వచ్చిందని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలన నుంచి ఏపీని కాపాడాల్సిన అవసరం ఉందని బలంగా చెప్పిన మాజీ సీఎం, ప్రధానంగా వ్యవసాయం, సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, ఉద్యోగులు, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి అంశాలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏపీలో 42 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అలాంటి పండుగ లాంటి వ్యవసాయాన్ని కూటమి పాలనలో దండగలా చేశారని జగన్ ఆరోపించారు.

...::: తరువాయి 4వ పేజీలో..

## ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్ తెస్తా..



**ఆదిలాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్ కు ఎయిర్ బస్‌ను తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాపాలన రెండేళ్ల విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత, స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన, ఆదిలాబాద్ కు పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

...::: తరువాయి 5వ పేజీలో..



### కారు చౌకగా ఉగ్రవాద మహిళలకుశిక్షణ
## ₹ 500లకే జైషే ప్యాకేజ్

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఎర్రకోట పేలుడు ఘటన దర్యాప్తు చేస్తున్న కొద్ది రోజులకే మరో కొత్త కోణం వెలుగుచూసింది. ఐసిస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో మహిళలను ఆత్మహుతి దళాలుగా తీర్చిదిద్దేందుకు జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజహర్ పెద్ద వ్యూహమే పన్నినట్టు భద్రతా దళాలకు కీలక సమాచారం అందింది. జైషే కార్యకలాపాల విస్తరణలో భాగంగా, తన సోదరి సాదియా అజహర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'జమాత్ ఉల్ మొమినాత్' విభాగానికి, మసూద్ అజహర్ స్పెషల్ టాస్క్ అప్పగించారు. ఇప్పటికే 5,000 మందికి పైగా మహిళలను రిక్రూట్ చేసిన ఈ యూనిట్ లో ఉగ్రవాద శిక్షణ తీసుకున్న వారందరి మైండ్ సెట్ ను పూర్తిగా మార్చివేసిన మసూద్ అజహర్, తాజాగా స్పెషల్ ఆఫర్లు కూడా ప్రకటించాడు.

...::: తరువాయి 3వ పేజీలో..

### ఇమ్రాన్ విముక్తికి
## మునీర్‌పై ఒత్తిడి
### పాక్‌కు అమెరికా కఠిన హెచ్చరికలు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కు రాజకీయ ఖైదు నుంచి విముక్తి కల్పించాలని ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ పై అమెరికా ఒత్తిడి తీసుకువచ్చింది. లేదంటే ఆంక్షలకు సిద్ధమవ్వాలని పాక్ ను అమెరికా హెచ్చరించింది. పాకిస్తాన్ లో మానవ హక్కుల హననం జరుగుతోందని, పాక్‌లో అమెరికన్ పౌరులపై దాడులు పెరుగుతున్నాయని అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు ప్రమీలా జయపాల్, గ్రెగ్ కాసార్ బృందం విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో దృష్టికి తీసుకొచ్చారు. అమెరికా జర్నలిస్ట్ అహ్మద్ నూరానీ కుటుంబాన్ని అపహరించటం, పాక్-అమెరికన్ మ్యూజిషియన్ సల్మాన్ అహ్మద్ బంధువులను కిడ్నాప్ చేయడం వంటి ఘటనలపై 44 మంది కాంగ్రెస్ సభ్యులు, మార్కో రూబియోకు గురువారం రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. మిలటరీ అవినీతి కథనాలు రాసిన నూరానీ కుటుంబంపై దాడులు జరిగిన విషయాన్ని వారు ఆ లేఖలో ప్రస్తావించారు.

...::: తరువాయి 3వ పేజీలో..



## రోహింగ్యాల చిట్టా రెడీ
### ఉత్తరప్రదేశ్ లో యోగీ సర్కార్ స్పెషల్ డ్రైవ్...

**లక్నో (ఏడీఎన్ఎన్) :**

భారత్ లోకి అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమికొట్టడమే లక్ష్యంగా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోహింగ్యాలు, బంగ్లా దేశీయులపై ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ దాస్ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతిపరిపాలన విభాగంలో తాత్కాలిక నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అనుమానిత చొరబాటు దారులపై కూడా నివేదిక ఇవ్వాలని యోగీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవల్సిందిగా పోలీసులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఉన్న సంబంధిత చొరబాటుదారుల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి యోగీ అదిత్యనాథ్ కోరారు. అయితే, ఈ జాబితాలను కమిషనర్, ఇన్ పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కు అందజేస్తారు. దర్యాప్తు పూర్తయ్యే వరకూ చొరబాటుదారులను తాత్కాలిక నిర్బంధ కేంద్రాల్లోనే ఉంచి, వారి స్వదేశాలకు పంపిస్తారు. ఆదేశాలు రావడం ప్రారంభించినందున, పోలీస్ యంత్రాంగం ఈ అంశంపై ప్రధాన చర్యలు తీసుకునే అవకాశం స్పష్టంగా కన్పిస్తోంది. గత నెల 22న ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ అన్ని జిల్లా న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు.

...::: తరువాయి 2వ పేజీలో..

### పీఐఏ షేర్లలో 51 నుంచి 100 శాతం అమ్మకం..
## అమ్మకానికి పాక్ ఎయిర్ లైన్స్
### కొనటానికి పాక్ ఆర్మీ కూడా రెడీ!




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ బ్యాంకు నుంచి కొత్త రుణాల కోసం ప్రయత్నించడంలో భాగంగా, అప్పుల ఊబిలో కూరుకుపోయిన పాకిస్తాన్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. అమెరికా వంటి దేశాల సిఫార్సుతో ప్రపంచ బ్యాంకు చేస్తున్న సాయం కూడా పాకిస్తాన్ కు ఇప్పుడు సరిపోవడం లేదు . అయితే ఇప్పుడు ఏకంగా తమ అంతర్జాతీయ ఎయిర్ లైన్స్ సంస్థ పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ లైన్స్ ను వేలం వేయాలని నిర్ణయించింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాకిస్తాన్, 7 బిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు బెయిల్ అవుట్ ప్యాకేజ్ పొందేందుకు షరతులు నెరవేర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది . ఈ నెల23వ తేదీన పీఐఏను వేలం వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఎయిర్ లైన్స్ పూర్తి నిర్వహణ, నియంత్రణతో సహా ఇందులో 51 శాతం వాటాల్ని అమ్మేయాలని నిర్ణయించింది. ఈ వేలానికి ముందస్తు అర్హత పొందిన నాలుగు కంపెనీలలో, సైనిక నియంత్రణలో ఉన్న ఫౌజీ ఫౌండేషన్‌లో భాగమైన ఫౌజీ ఫెర్టిలైజర్ కంపెనీ లిమిటెడ్ కూడా ఉంది. ఈ ప్రైవేటీకరణ ద్వారా వచ్చే ఆదాయంలో 15 శాతం ప్రభుత్వానికి వెళ్తుందని, మిగిలినది కంపెనీలోనే ఉంటుందని పాకిస్తాన్ ప్రైవేటీకరణ మంత్రి ముహమ్మద్ అలీ తెలిపారు. కొత్త రుణ ప్యాకేజీ కోసం పాకిస్తాన్ ఈ వేలానికి సిద్ధమైంది.

## అఖండ-2 విడుదల వాయిదా!



### ఆందోళనలో ఫ్యాన్స్ | ఆర్థిక లావాదేవీలే కారణమా..?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

బాలకృష్ణ–బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న థియేటర్లలో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఆర్థిక పరమైన సమస్యల్లో చిక్కుకుందని ప్రచారం జరిగింది. ప్రీమియర్ షోలను చిత్ర బృందం అకస్మాత్తుగా రద్దు చేయడంతో విడుదలపై అనుమానాలు మొదలయ్యాయి. దీనిపై నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఎక్స్ వేదికగా అధికారిక ప్రకటన విడుదల చేసింది. అనివార్య కారణాల వల్ల చిత్రం నిర్ణీత తేదీన విడుదల కావడం లేదని, అభిమానులకు కలిగిన నిరాశ పట్ల చింతిస్తున్నామని, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ నిర్ణయం వల్ల కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్తూ, త్వరలో సానుకూల సమాచారాన్ని అందిస్తామని సంస్థ ప్రకటించింది.



## వందేళ్ల... ఆర్ఎస్ఎస్
### భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం



### ఆత్మ, శరీరం: సంఘ్ - బీజేపీ సంబంధం ఒక అవినాభావ బంధం
### భారత రాజకీయాల్లో ఒక అపూర్వ నమూనా

భారతదేశ రాజకీయాలను గమనించే విదేశీ పరిశీలకులకు, లేదా మన దేశంలోని 'లౌకికవాద' మేధావులకు ఎప్పటికీ అర్థం కాని, ఎప్పుడూ ఆశ్చర్యాన్ని, కొన్నిసార్లు అసహనాన్ని కలిగించే ఒక అంశం ఉంది. అదే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) మరియు భారతీయ జనతా పార్టీ (BJP) మధ్య ఉన్న సంబంధం. ప్రతిపక్షాలు దీనిని "రిమోట్ కంట్రోల్" అని విమర్శిస్తాయి. "బీజేపీకి సొంత నిర్ణయాధికారం లేదు, అంతా నాగ్‌పూర్ (సంఘ్ కేంద్ర కార్యాలయం) నుంచి వచ్చే ఆదేశాలే" అని ఆరోపిస్తాయి. "రాజ్యాంగేతర శక్తి (ExtraConstitutional Authority) ప్రభుత్వాన్ని నడిపిస్తోంది" అని గగ్గోలు పెడతాయి. కానీ, ఈ విమర్శలన్నీ ఆ సంబంధం యొక్క లోతును, దాని తాత్విక పునాదిని, దాని చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోలేని ఉపరితల వ్యాఖ్యానాలు మాత్రమే. వాస్తవానికి, సంఘ్‌బీజేపీ మధ్య ఉన్నది యజమాని-నౌకరు సంబంధం కాదు. అది నియంతబానిస సంబంధం కాదు. అది ఒక అత్యంత పవిత్రమైన, సేంద్రియమైన (Organic), అవినాభావ సంబంధం. సరళంగా చెప్పాలంటే, సంఘ్ 'ఆత్మ' (Soul) అయితే, బీజేపీ 'శరీరం' (Body). ఆత్మ లేని శరీరం శవం. శరీరం లేని ఆత్మకు కర్మాచరణ ఉండదు. ఈ రెండూ వేర్వేరుగా ఉంటూనే, ఒకే లక్ష్యం కోసం 'పరమ వైభవశాలి భారత్' నిర్మాణం కోసం పనిచేసే రెండు వ్యవస్థలు. ఒకటి సాంస్కృతిక క్షేత్రంలో మనుషులను (Manmaking) తయారుచేస్తే, మరొకటి రాజకీయ క్షేత్రంలో దేశాన్ని (Nation Building) నిర్మిస్తుంది.

...::: తరువాయి 2వ పేజీలో..

### చంద్రబాబు పై కేసు మూసివేయొద్దు...
## హైకోర్టులో వైసీపీ పిటీషన్



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ ప్రాజెక్టు అక్రమాల కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసీపీ ప్రభుత్వ హయాంలో నమోదైన ఈ కేసును మూసివేయకూడదంటూ వైసీపీ నాయకుడు గౌతమ్ రెడ్డి ఏసీబీ ప్రత్యేక కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కిందటి నెల 26న క్లోజ్ చేసిన ఈ కేసు మళ్లీ తిరిగి ఓపెన్ చేసే అవకాశం ఏర్పడింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 8వ తేదీన హైకోర్టు లో విచారణ జరుగుతుంది. 2017-18లో టీడీపీ ప్రభుత్వ కాలంలో అమలైన ఏపీ ఫైబర్‌నెట్ ఫేజ్ 1 ప్రాజెక్టులో రూ.114 కోట్లు నష్టం వాటిలిందన్న ఆరోపణలతో 2019లో సీఐడీ ఈ కేసును నమోదు చేసింది. టెండర్లలో అక్రమాలు, బ్లాక్‌లిస్ట్ కంపెనీకి అనుచితంగా పనులు కేటాయించారని పేర్కొంటూ 2023 అక్టోబర్‌లో చంద్రబాబును ఏ-25 గా చేర్చారు. 2024 ఎన్నికల తర్వాత, కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే - స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్, ఫైబర్‌నెట్ తదితర కేసులను ప్రభుత్వం వరసగా మూసివేస్తూ వస్తోంది. ఫైబర్‌నెట్ కేసును కూడా కోర్టు కిందటి నెల 26వ తేదీన మూసివేసింది. రాష్ట్రానికి నష్టం జరగలేదని, తొలి ఫిర్యాదుదారుడైన మాజీ ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ మధుసూదన్ రెడ్డి కూడా కేసు మూసివేతకు అంగీకరించారని, ప్రభుత్వం కోర్టు కు తెలియజేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేసిన వైసీపీ నాయకుడు గౌతమ్ రెడ్డి, ఇందులో రాజకీయ ఒత్తిడి ఉందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేయడంతో మరోసారి ఈ కేసు చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 8వ తేదీన జరగనున్న విచారణ, కేసు భవితవ్యంపై కీలక ప్రభావం చూపనుంది.

## పుతిన్ పర్యటన పై బ్లూమ్‌బెర్గ్ సంచలన కథనం


Bloomberg

India Clinches $2 Billion Russia Submarine Deal as Putin Visits

By Bloomberg News
December 4, 2025 at 1:36 PM GMT+5:30

Save | Translate | Listen 4:17

Takeaways by Bloomberg AI
- India will pay about $2 billion to lease a nuclear-pow… Russia, finalizing delivery of the vessel after roughly a …
- The submarine would be larger than the two already part of the navy's fleet and is expected to be delivered within two years, although the complexity of the project means it could be later.
- The Russian leased vessel would be with India's Navy for 10 years and would help India train sailors and refine nuclear-boat operations as it builds its own vessels, under the condition that it cannot be used in war.



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పర్యటన వేళ బ్లూమ్‌బెర్గ్ గురువారం ప్రచురించిన కథనం రాజకీయ, దౌత్య వర్గాల్లో సంచలనం రేపింది. భారత్ రష్యా నుంచి 2 బిలియన్ డాలర్ల అణు జలాంతర్గామిని లీజుకు తీసుకునే కొత్త ఒప్పందం కుదిరిందని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. అయితే ఈ వార్తను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. భారత్, రష్యాల మధ్య కొత్త సబ్‌మెరైన్ లీజు ఒప్పందం ఏదీ జరగలేదని స్పష్టం చేసింది . ప్రస్తుతం ప్రస్తావనలో ఉన్న లీజు ఒప్పందం 2019లోనే కుదిరిందని, ఆ సబ్‌మెరైన్ 2028 నాటికి భారత్‌కు అందుతుందని వివరించింది. పుతిన్ పర్యటన నేపథ్యంలో తప్పుడు కథనం ప్రచురితమైందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రక్షణ రంగంలో రెండుదేశాలు కొనుగోలుదారు-అమ్మకదారు స్థాయి దాటి, సంయుక్త పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వామ్యం దిశగా ఎదిగాయని ప్రభుత్వం వివరించింది. టీ-90 ట్యాంకులు, సు-30 ఎంకేఐ విమానాలు, బ్రహ్మోస్ క్షిపణి వంటి ప్రాజెక్టులు ఈ బంధానికి నిదర్శనమని కేంద్ర వర్గాలు తెలిపాయి .

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
శుక్రవారం | హైదరాబాద్
05.12.2025
www.manasarkar.com



# అంతర్రాష్ట్ర బస్సులో పట్టుబడిన రూ.72 లక్షల నగదు

**కేరళ (ఏడీఎన్ఎన్) :**

కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంత రాష్ట్ర బస్సులో ఈ నగదును పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం పండుగలు సహా కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మాదకద్రవ్యాలు, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు సోదాలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీల్లో అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ నిర్వహించగా, వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.స్వాధీనం చేసుకున్న డబ్బు మొత్తం రూ.72 లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఏపీకి చెందిన షేక్ జాఫర్, షాషాస్‌గా గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలను ఇద్దరూ సమర్పించలేకపోయారు. ఇద్దరు అనుమానితులను తదుపరి దర్యాప్తు కోసం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. భారీగా పట్టుబడిన ఈ నగదు వెనుక హవాలా రాకెట్ ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తూ, నిందితుల వద్ద నుంచి తీసుకున్న ఫోన్లను కూడా జప్తు చేశారు. ఈ నిధులను ఉగ్రవాద కార్యకలాపాల వినియోగం కోసం తరలిస్తున్నారా? లేక మరేదానికోసమా? అని తెలుసుకోవడానికి సైబర్ ఫోరెన్సిక్ అధికారులు విచారిస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అంతర్రాష్ట్ర బస్సులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. చిన్న ప్రైవేట్ వాహనాల మాదిరిగా కాకుండా, బస్సులను తనిఖీల కోసం చాలా అరుదుగా ఆపివేస్తారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని చాలా అరుదుగా మాత్రమే బస్సులను తనిఖీ చేస్తుంటారు. ఈ అవకాశాన్ని కొన్ని ముఠాలు అక్రమాల కోసం ప్రణాళికాబద్ధంగా వాడుకుంటున్నాయి.

# రోహింగ్యాల చిట్టా రెడీ

**మొదటి పేజీ తరువాయి...**

భారత్ లో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశ్ జాతీయులను అత్యవసరంగా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అక్రమంగా నివసిస్తున్న లేదా వారి గుర్తింపులను దాచిపెట్టిన బంగ్లాదేశీయులను గుర్తించడానికి అధికారులు చొరవ తీసుకున్నారు. యూపీలోని అనేక నగరాల్లో మురికివాడలు, ఎంపిక చేసిన ప్రదేశాలపై దాడులు సైతం నిర్వహించారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, ఓటర్ ఐడీ కార్డులను తనిఖీ చేయడం ద్వారా పౌరసత్వాన్ని ధృవీకరించడానికి పోలీసులు ప్రచారాలను నిర్వహించారు. లక్నోలోని ఠాకూర్ గంజ్ ప్రాంతంలో నర్గీస్ అనే బంగ్లాదేశ్ మహిళను ఇటీవల అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవల ఓ హెబియస్ కార్పస్ పిటిషన్ ను సుప్రీం కోర్టు విచారించింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్నవారికి రెడ్ కార్పెట్ పరచలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అలాంటి వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం భారత్ కు లేదని వ్యాఖ్యానించింది. అక్రమ చొరబాటుదారులను గుర్తించాలని ఉత్తర ప్రదేశ్ పరిపాలన త్వరలోనే ఆదేశాలు జారీ చేసింది. ఇది రాబోయే రోజుల్లో పెద్ద ఆపరేషన్ గా మారే అవకాశం ఉండోచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



# స్టాలిన్‌తో ఏఐసీసీ బృందం భేటీ

## 2026 అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు కోసమేనా?

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి చెందిన ఐదుగురు సభ్యుల ప్రతినిధి బృందం తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో సమావేశమైంది. కాంగ్రెస్ ప్రతినిధి బృందం "మర్యాదపూర్వక భేటీ''గా అభివర్ణించింది. అయితే 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటు గురించి మాట్లాడేందుకు వచ్చారన్న ప్రచారం కొనసాగుతోంది. స్టాలిన్‌ను కలిసిన వారిలో ఏఐసీసీ తమిళనాడు ఇన్‌చార్జ్ కీర్తి ఆజాద్ షోడంకర్, టీఎన్సీసీ అధ్యక్షుడు కే. సెల్వపెరుంతగై, కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు ఎం. రాజేష్ కుమార్ ఏఐసీసీ కార్యదర్శులు సూరజ్ ఎంఎన్ హెగ్డే నివేదిత్ అల్వా ఉన్నారు. తమిళనాడులో ఇండియా కూటమి గతంలో కంటే బలంగా ఉంది. ఇక సీట్ల సర్దుబాటు విషయానికొస్తే కమిటీ ఏర్పడ్డాక చర్చలు ప్రారంభమవుతాయి, స్టాలిన్‌తో సమావేశం తర్వాత సెల్వపెరుంతగై విలేఖరులతో మాట్లాడారు. "స్టాలిన్‌తో మాది మర్యాద పూర్వక భేటీ మాత్రమే. " అని ఆయన చెప్పారు. 2021లో అప్పటి టీఎన్ సీసీ టీఎన్ సీసీ చీఫ్ కేఎస్ అళగిరి నేతృత్వంలో డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమి 25 సీట్లతో సరిపెట్టుకుంది. అందులో 18 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి ఎన్నికలలో బలమైన ప్రత్యర్థులతో పోటీ పడాలంటే గ్రాండ్ ఓల్డ్ పార్టీ డీఎంకే తో కలిసి కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ సారి పోటీలో బలమైన ప్రత్యర్థులు.. రానున్న 2026 ఎన్నికలలో బలమైన అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. ఒకవైపు విజయ్ చిత్రపరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి సొంత పార్టీ తమిళగ వెట్రీ కజగం (టీవీకే ) పెట్టారు. ఆయన ఎన్నికల ప్రచారం కూడా మొదలుపెట్టారు. మరోవైపు బీజేపీ ఎఐఏడీఎంకే తో జతకట్టింది. ఇటీవలి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ టీవీకే చీఫ్ విజయ్‌తో రెండుసార్లు ఫోన్‌లో నేరుగా మాట్లాడారని టీఎన్‌సీసీ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.తాజా పరిణామంపై రాజకీయ విశ్లేషకుడు రవిదరన్ దురైసామి మాట్లాడుతూ.. " సీట్ల పంపకాల చర్చల కమిటీని డీఎంకే ఇంకా ఏర్పాటు చేయలేదు. కానీ కాంగ్రెస్ ఎందుకు తొందరపడుతుందో తెలియాల్సి ఉంది. కూటమిని విడిచిపెట్టకూడదని డీఎంకే అయినా తొందరపడుతుందాలి? మరికొన్ని రోజుల్లో వీటిని సమాధానాలు దొరుకుతాయి," అని అన్నారు.

# ఆత్మ, శరీరం: సంఘ్ - బీజేపీ సంబంధం ఒక అవినాభావ బంధం

**మొదటి పేజీ తరువాయి...**

సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ నాటిన విత్తనం నుంచి పుట్టిన ఈ రెండు శాఖలు, ఒకదానికొకటి ఎలా సహకరించుకుంటాయి? వాటి మధ్య ఉండే 'సమన్వయం' (Coordination) ఎలా పనిచేస్తుంది? బీజేపీ ప్రభుత్వాలకు సంఘ్ ఎందుకు, ఎలా మార్గనిర్దేశం చేస్తుంది? ఈ సంబంధం దేశానికి ఎందుకు అవసరం? అనే ప్రశ్నలను ఇందులో సమగ్రంగా, సానుకూల దృక్పథంతో విశ్లేషించుకుందాం. ఇది కేవలం రాజకీయ విశ్లేషణ కాదు, ఇది ఒక 'కుటుంబ వ్యవస్థ' (Parivar System) యొక్క అంతరార్థ పరిశీలన.

**చారిత్రక నేపథ్యం – రాజకీయాలలోకి సంఘ్ ఎందుకు వచ్చింది?**

సంఘ్‌బీజేపీ సంబంధాన్ని అర్థం చేసుకోవాలంటే, ముందుగా సంఘ్ రాజకీయాల్లోకి ఎందుకు అడుగుపెట్టింది (పరోక్షంగా) అనే చరిత్ర తెలియాలి.

**సంఘ్:** అరాజకీయ సంస్థ (Apolitical Organization): 1925లో డాక్టర్ హెడ్గేవార్ సంఘ్ను స్థాపించినప్పుడు, దానిని రాజకీయాలకు దూరంగా ఉంచారు. "రాజకీయాలు అధికారం కోసం అర్రులు చాస్తాయి, సంఘ్ సమాజ నిర్మాణం కోసం తపిస్తుంది" అనేది ఆయన భావన. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా సంఘ్ ఒక సంస్థగా రాజకీయ పోరాటం చేయకపోయినా, స్వయంసేవకులు వ్యక్తిగతంగా పాల్గొన్నారు.

**నెహ్రూ యుగం – రాజకీయ రక్షణ అవసరం:**

కానీ, 1947 తర్వాత పరిస్థితులు మారాయి. గాంధీజీ హత్య (1948) తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా సంఘ్‌పై నిషేధం విధించింది. సంఘ్ నిర్దోషి అని తేలినా, రాజకీయ కక్షసాధింపు చర్యలు జరిగాయి.

- **ఆ సమయంలో,** పార్లమెంటులో సంఘ్ తరఫున మాట్లాడేవారు, సంఘ్ భావజాలాన్ని సమర్థించేవారు ఎవరూ లేరు.
- **"రాజకీయ అధికారం** లేకపోతే, ఎంత మంచి పని చేసినా, దుష్ట శక్తులు దానిని అణచివేస్తాయి" అనే సత్యాన్ని సంఘ్ గ్రహించింది. సమాజంలో ధర్మాన్ని రక్షించాలంటే, రాజకీయ క్షేత్రంలో కూడా ధర్మం ఉండాలి.

**జనసంఘ్ జననం – శ్యామ ప్రసాద్ ముఖర్జీకి అండగా:**

సరిగ్గా అదే సమయంలో (1951), నెహ్రూ ప్రభుత్వ విధానాలతో విభేదించి బయటకు వచ్చిన మహానాయకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, ఒక కొత్త జాతీయవాద పార్టీని (భారతీయ జనసంఘ్) స్థాపించాలనుకున్నారు. ఆయనకు కార్యకర్తల బలం కావాలి. ఆయన సంఘ్ రెండవ సర్ సంఘ్‌చాలక్ శ్రీ గురూజీ గోల్వల్కర్ గారిని కలిశారు.

- **గురూజీ** ఒక చారిత్రక నిర్ణయం తీసుకున్నారు: "సంఘ్ ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి రాదు. కానీ, మీరు స్థాపించే పార్టీ జాతీయ హితం కోసం పనిచేస్తే, దానికి మా స్వయంసేవకులను (కార్యకర్తలను) సహాయంగా పంపిస్తాము."
- **అలా, సంఘ్** తన అత్యంత ప్రతిభావంతులైన ప్రచారకులను - పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ, నానాజీ దేశ్‌ముఖ్ వంటి వారిని - జనసంఘ్ నిర్మాణానికి 'అప్పుగా' (On loan) ఇచ్చింది.

**ఇదే బీజేపీ** (నాటి జనసంఘ్) మరియు సంఘ్ మధ్య బంధానికి పునాది. ఇది రాజకీయ అవసరం కోసం ఏర్పడింది కాదు, 'జాతీయ అవసరం' కోసం ఏర్పడిన బంధం.

సంబంధం యొక్క స్వభావం - మాతృసంస్థ మరియు క్షేత్ర సంస్థ

**సంఘ్-బీజేపీ** సంబంధాన్ని నిర్వచించడానికి సరైన పదం "మాతృసంస్థ అనుబంధ సంస్థ".

బీజేపీ అనేది సంఘ్ పరివార్‌లోని అనేక క్షేత్రాలలో (విద్యార్థి, కార్మిక, రైతు, మత) పనిచేస్తున్న సంస్థలలో ఒకటి. కానీ, దీనికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే ఇది రాజ్యాధికారాన్ని (State Power) ప్రభావితం చేస్తుంది.

**1. సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం (Ideological Mentorship):**

బీజేపీకి సొంత సిద్ధాంతం అంటూ వేరే ఏమీ లేదు. సంఘ్ సిద్ధాంతమే బీజేపీ సిద్ధాంతం.

- **సాంస్కృతిక జాతీయవాదం (Cultural Nationalism):** భారతదేశం ఒక సనాతన రాష్ట్రం.
- **ఏకాత్మ మానవతా వాదం (Integral Humanism):** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అందించిన ఈ సిద్ధాంతమే బీజేపీకి ఆత్మ.
- **అంత్యోదయ:** చివరి వ్యక్తికి సేవ చేయడం.

సంఘ్ ఈ సిద్ధాంతాలను రూపొందిస్తుంది, బోధిస్తుంది. బీజేపీ వాటిని రాజకీయ విధానాలుగా (Policies) మలిచి, అమలు చేస్తుంది. అంటే, సంఘ్ ఒక 'థింక్ ట్యాంక్' (Think Tank) లాంటిది, బీజేపీ ఒక 'ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ' (Executing Agency) లాంటిది.

**2. మానవ వనరుల సరఫరా (Manpower Supply):**

ఇది ఈ సంబంధంలోని అత్యంత కీలకమైన అంశం. బీజేపీకి వెన్నెముకగా నిలిచే నాయకులు, కార్యకర్తలు ఆకాశం నుంచి ఊడిపడరు. వారు సంఘ్ అనే టంకశాలలో తయారైన నాణేలు.

- **ప్రధాని మోదీ నుంచి,** అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ వరకు... అందరూ సంఘ్ శాఖలలో 'సంస్కారం' (Character), 'దేశభక్తి', 'క్రమశిక్షణ' నేర్చుకున్నవారే.
- **సంఘ్ తన ప్రచారకులను** బీజేపీకి 'సంఘటనా మంత్రులుగా' (Organization Secretaries) పంపిస్తుంది. వీరు పార్టీకి, సంఘ్‌కు మధ్య వారధిగా (Bridge) ఉంటారు. వీరు ఎన్నికల్లో పోటీ చేయరు, పదవులు ఆశించరు. కేవలం పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండేలా చూస్తారు.

**3. నైతిక దిక్సూచి (Moral Compass):**

రాజకీయాల్లో అధికారం వచ్చినప్పుడు అవినీతి, అహంకారం రావడం సహజం. అప్పుడు ప్రభుత్వాన్ని, పార్టీని హెచ్చరించే, దారిలో పెట్టే 'నైతిక అధికారం' (Moral Authority) సంఘ్‌కు మాత్రమే ఉంది.

- **"మీరు గెలిచింది** మీ కోసం కాదు, దేశం కోసం" అని గుర్తుచేసే గురువు స్థానంలో సంఘ్ ఉంటుంది.

**'నియంత్రణ' కాదు... 'సమన్వయం' (Samanvay)**

విమర్శకులు ఆరోపించే "రిమోట్ కంట్రోల్" అనే పదంలో నిజం లేదు. సంఘ్ రోజువారీ రాజకీయాల్లో జోక్యం చేసుకోదు. ఏ అధికారిని బదిలీ చేయాలి? ఏ కాంట్రాక్ట్ ఎవరికి ఇవ్వాలి? అనే చిల్లర విషయాల్లో సంఘ్ ఎప్పుడూ తలదూర్చదు.

**సంఘ్ చేసేది "సమన్వయం" (Coordination).**

- **సమన్వయ బైఠక్‌లు:** సంవత్సరానికి ఒకటి రెండు సార్లు, సంఘ్ అగ్ర నాయకత్వం మరియు బీజేపీ అగ్ర నాయకత్వం (ప్రధాని, మంత్రులతో సహా) ఒకచోట చేరతారు.
- **ఇక్కడ ఆజ్ఞలు** జారీ చేయరు. చర్చ (Manthan) జరుగుతుంది.
- **సంఘ్ తన** క్షేత్రస్థాయి అనుభవాల (Feedback from grassroots) ఆధారంగా ప్రభుత్వానికి సూచనలు ఇస్తుంది. "ప్రజలు ఏమనుకుంటున్నారు? ఈ పథకం వల్ల నష్టం జరుగుతోందా? విద్యా విధానంలో మార్పులు ఎలా ఉండాలి?" వంటి జాతీయ ప్రాముఖ్యత గల అంశాలపై చర్చిస్తారు.
- **బీజేపీ** నాయకులు తమ ప్రభుత్వ పరిమితులను, అంతర్జాతీయ ఒత్తిళ్లను వివరిస్తారు.
- **ఇద్దరూ** కలిసి ఒక ఉమ్మడి నిర్ణయానికి వస్తారు. దీనిని 'నియంత్రణ' అనలేము, ఇది 'సమిష్టి బాధ్యత' (Collective Responsibility).

**ఉదాహరణ - వాజ్‌పేయి హయాం:**

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు, సంఘ్ అనుబంధ సంస్థలైన 'స్వదేశీ జాగరణ్ మంచ్', 'భారతీయ మజ్దూర్ సంఘ్' ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాయి. సంఘ్ వాటిని ఆపలేదు. "ప్రభుత్వం తన పని తాను చేసుకోవాలి, ప్రజా సంఘాలు తమ పని తాము చేసుకోవాలి" అని చెప్పింది. ఇది అంతర్గత ప్రజాస్వామ్యానికి (Internal Democracy) నిదర్శనం. అదే సమయంలో, ప్రభుత్వం పడిపోకుండా కాపాడింది కూడా సంఘమే.



**మోదీ శకం – పరిపూర్ణ సమన్వయం (Synergy)**

2014 తర్వాత, నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, సంఘ్‌బీజేపీ సంబంధం ఒక కొత్త, పరిపూర్ణ స్థాయికి (Golden Phase) చేరుకుంది. దీనికి కారణం మోదీ గారు స్వయంగా ఒక ప్రచారక్ కావడం, సంఘ్ సిద్ధాంతాన్ని ఆయన పూర్తిగా ఆకళింపు చేసుకోవడం.

**1. అజెండా అమలు:**

దశాబ్దాలుగా సంఘ్ ఏవైతే కోరుకుంటోందో (ఆర్టికల్ 370 రద్దు, రామ మందిర నిర్మాణం, సీఏఏ), వాటిని మోదీ ప్రభుత్వం ధైర్యంగా అమలు చేసింది. ఇక్కడ సంఘ్ ఒత్తిడి చేయాల్సిన అవసరం రాలేదు. ఇద్దరి లక్ష్యం ఒక్కటే కాబట్టి, పని సులువైంది.

**2. సేవా కార్యక్రమాలు:**

ప్రభుత్వ పథకాలు (స్వచ్ఛ భారత్, బేటీ బచావో) క్షేత్రస్థాయిలో విజయవంతం కావడానికి సంఘ్ కార్యకర్తలు పరోక్షంగా సహకరించారు. కరోనా సమయంలో సేవా భారతి చేసిన పని, ప్రభుత్వ యంత్రాంగానికి కొండంత అండగా నిలిచింది.

**3. విధాన రూపకల్పన (Policy Making):**

ముఖ్యంగా నూతన జాతీయ విద్యా విధానం (NEP 2020) రూపకల్పనలో సంఘ్ అనుబంధ సంస్థల (విద్యా భారతి, భారతీయ శిక్షణ్ మండల్) పాత్ర కీలకం. మెకాలే విద్యా విధానాన్ని మార్చి, భారతీయ విలువలతో కూడిన విద్యను తేవాలన్న సంఘ్ కలను ప్రభుత్వం సాకారం చేసింది.

ఇక్కడ కనిపించేది నియంత్రణ కాదు, ఒక "జుగల్‌బందీ". ఒకరు పాట పాడితే, మరొకరు తబలా వాయించినట్లు... ఇద్దరూ లయబద్ధంగా 'జాతీయ గీతాన్ని' ఆలపిస్తున్నారు.

అపోహలు వాస్తవాలు

ఈ సంబంధంపై ఉన్న కొన్ని అపోహలను (Myths) తొలగించుకోవడం అవసరం.

**అపోహ 1:** బీజేపీకి స్వేచ్ఛ లేదు.

**వాస్తవం:** బీజేపీ ఒక స్వతంత్ర రాజకీయ పార్టీ. దానికి సొంత రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ, పార్లమెంటరీ బోర్డు ఉన్నాయి. టికెట్ల పంపిణీ, మంత్రుల ఎంపిక వంటి రాజకీయ నిర్ణయాలు బీజేపీ స్వయంగా తీసుకుంటుంది. సంఘ్ కేవలం నైతిక మార్గదర్శనం మాత్రమే చేస్తుంది. అమిత్ షా, నడ్డా వంటి అధ్యక్షులు స్వతంత్రంగా పార్టీని నడుపుతారు.

**అపోహ 2:** సంఘ్ రాజ్యాంగేతర శక్తి.

**వాస్తవం:** సంఘ్ అనేది ఈ దేశ పౌరులతో కూడిన సంస్థ. ప్రజాస్వామ్యంలో పౌర సమాజం (Civil Society), ఒత్తిడి సమూహాలు (Pressure Groups) ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడం తప్పు కాదు, అది వారి హక్కు. సంఘ్ తనకున్న సామాజిక బలాన్ని ఉపయోగించి, జాతీయ హితం కోసం ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధమే. సోనియా గాంధీ హయాంలో ఎన్.ఎ.సి (NAC) రాజ్యాంగేతర శక్తిగా ఎలా వ్యవహరించిందో, సంఘ్ అలా ఎప్పుడూ వ్యవహరించలేదు. సంఘ్ ఫైళ్లను తెప్పించుకోదు, కేవలం సలహాలు ఇస్తుంది.

**అపోహ 3:** సంఘ్ అంటే బీజేపీ, బీజేపీ అంటే సంఘ్.

**వాస్తవం:** ఈ రెండూ ఒకటే కాదు. బీజేపీలో చేరడానికి ఎవరైనా రావచ్చు (కాంగ్రెస్ నుంచి, ఇతర పార్టీల నుంచి). కానీ సంఘ్ స్వయంసేవక్ కావాలంటే ఒక ప్రత్యేకమైన శిక్షణ, మనస్తత్వం కావాలి. బీజేపీ అధికారం కోసం కొన్నిసార్లు రాజీ పడవచ్చు (పొత్తులు), కానీ సంఘ్ సిద్ధాంతం విషయంలో ఎప్పుడూ రాజీ పడదు.

**దేశానికి ఈ బంధం ఎందుకు అవసరం?**

సంఘ్ మరియు బీజేపీ మధ్య ఉన్న ఈ అనుబంధం, భారతదేశానికి ఒక వరం లాంటిది.

1. **జాతీయ భద్రత:** రాజకీయ పార్టీలు ఓట్ల కోసం దేశ భద్రతను తాకట్టు పెట్టే ప్రమాదం ఉంది. కానీ, వెనుక సంఘ్ వంటి దేశభక్త సంస్థ ఉన్నప్పుడు, బీజేపీ అటువంటి తప్పు చేయలేదు. కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, చైనా సరిహద్దుల విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉండటానికి సంఘ్ వెన్నుదన్నే కారణం.
2. **సాంస్కృతిక రక్షణ:** పాశ్చాత్య సంస్కృతి దాడి నుంచి, మన సనాతన ధర్మాన్ని, విలువల వ్యవస్థను కాపాడటానికి ఒక రాజకీయ శక్తి అవసరం. సంఘ్ ఆ శక్తిని బీజేపీ ద్వారా అందిస్తోంది. రామ మందిరం, కాశీ కారిడార్ వంటివి దీని ఫలితాలే.
3. **అవినీతి నియంత్రణ:** ఇతర పార్టీలలో కుటుంబ పాలన, అవినీతి సర్వసాధారణం. కానీ బీజేపీలో, ముఖ్యంగా సంఘ్ నేపథ్యం ఉన్న నాయకులలో (మోదీ, యోగి, గడ్కరీ) వ్యక్తిగత అవినీతి చాలా తక్కువ. దీనికి కారణం సంఘ్ నేర్పిన "దేశం నాది, నేను దేశానిది" అనే సంస్కారం.
4. **స్థిరత్వం:** కార్యకర్తల బలం లేని పార్టీలు గాలివాటుకు కొట్టుకుపోతాయి. కానీ సంఘ్ అనే వేర్లు ఉండటం వల్ల, బీజేపీ ఎన్ని ఓటములు వచ్చినా తట్టుకుని నిలబడగలుగుతోంది. ఇది దేశ రాజకీయాల్లో స్థిరత్వాన్ని (Stability) ఇస్తుంది.

**రెండు చక్రాల రథం**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ... ఇవి వేర్వేరు పేర్లతో ఉన్న ఒకే ఆత్మ.

- **సంఘ్** ఒక విశ్వవిద్యాలయం అయితే, బీజేపీ అందులో చదివిన విద్యార్థులు పాలించే ప్రభుత్వం.
- **సంఘ్** మూలాలు (Roots) అయితే, బీజేపీ పండ్లు (Fruits).

ఈ సంబంధం 'నియంత్రణ' (Control) అనే చిన్న పదం పరిధిలోకి రాదు. ఇది "అనుబంధం" (Bonding). ఇది ఒక తల్లికి, బిడ్డకు ఉండే బంధం. బిడ్డ (బీజేపీ) పెద్దవాడై, ప్రధాని అయి దేశాన్ని ఏలుతున్నా, తల్లి (సంఘ్) ప్రేమతో, హక్కుతో "నాయనా, ధర్మం తప్పకు, పేదవాడిని మర్చిపోకు" అని చెప్పే పవిత్రమైన బంధం.

**రచన: భూక్యా గోపినాయక్**

**భారతదేశం ఈనాడు ప్రపంచంలో ఒక శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందంటే, దానికి కారణం... ఢిల్లీ సింహాసనంపై కూర్చున్న 'రాజనీతి'కి, నాగ్‌పూర్ నుంచి అందుతున్న 'రాష్ట్రనీతి' తోడు కావడమే. ఈ సమన్వయమే నవభారత నిర్మాణానికి పునాది.**

# విమానాలు రద్దుతో గందరగోళం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**




దేశవ్యాప్తంగా ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఢిల్లీ, ముంబయి, బెంగళూరు సహా పలు నగరాల్లో దాదాపు 300 పైగా విమానాలు రద్దయ్యాయి. అనేక విమానాలు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె .రామ్మోహననాయుడు రంగంలోకి దిగి గురువారం చర్చలు జరిపారు. పైలట్ రోస్టరింగ్, షెడ్యూలింగ్‌లో తీవ్ర నిర్వహణ లోపం ఉందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. వృత్తి ప్రమాణాలకు విరుద్ధంగా పని చేస్తున్నారని పౌరవిమాన శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అంతరాయాలకు పైలట్ల కొరతే ప్రధాన కారణమని పౌర విమానాల నియంత్రణ సంస్థ ( డీజీసీఏ ) ప్రకటించింది. కొనసాగుతున్న రద్దీలను పరిశీలిస్తున్నామని, సమస్యను పరిష్కరించేందుకు ఇండిగో తో కలిసి పనిచేస్తున్నామని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతామని వెల్లడించింది. కొందరు పైలట్లు డ్యూటీ రోస్టర్స్ (షిఫ్ట్ టైమ్)ను పాటించకుండా , ఇతర విమానయాన సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారని మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో నిర్వహణ సమస్యలకు దారితీస్తున్నాయని పేర్కొంది. సాంకేతిక సమస్యలు, ప్రతికూలవాతావరణం, విమాన డ్యూటీ సమయ పరిమితుల్లో మార్పులు ,తాజా సంక్షోభానికి దోహదం చేస్తున్నాయని కేంద్రం వ్యాఖ్యానించింది. మరోవైపు , ఒక్కరోజే 170కి పైగా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. గురువారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరాల్సిన 30కి పైగా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్‌లో సుమారు 33 విమానాలు రద్దు అయ్యాయి. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ లో 73 ఇండిగో విమానాలు ఆగిపోయాయి. ముంబై, అహ్మదాబాద్ వంటి ఇతర నగరాల్లో కూడా అనేక విమానాలు నిలిచిపోయాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల నుంచే దాదాపుగా 200 విమానాలు రద్దు కావడంతో , ప్రయాణీకులు ఆందోళనకు గురవుతున్నారు . ఎయిర్‌పోర్ట్ లలో విమానాలు 12 గంటలకు పైగా ఆలస్యం కావడం లేదా రద్దు కావడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో నిన్న సాయంత్రం 6 గంటల నుంచి ఈ రోజు ఉదయం 9 గంటల వరకు ( 12 గంటలకు పైగా ) ఉన్న, పుణె విమానం విషయంలో ఇండిగో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇది చాలా అసౌకర్యాన్ని కలిగించింది" అని ఒక యూజర్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. మరొక యూజర్ "12 గంటలకు పైగా ఆలస్యమైన విమానాలకు వసతి కల్పించకుండా, 'మరో రెండు గంటల్లో సిబ్బంది వస్తారు' అని చెబుతూ మమ్మల్ని నిరీక్షించేలా చేశారు. ఇది ఆమోదయోగ్యం కాదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు దాదాపు 2,200 విమానాలను నడిపే ఇండిగో, తమ సేవల వైఫల్యాన్ని అంగీకరించింది. విమాన ప్రయాణికులకు క్షమాపణలను కోరింది. ఈ గందరగోళంపై ఇండిగో సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఊహించని సాంకేతిక లోపాలు, శీతాకాలం కారణంగా షెడ్యూల్‌లో మార్పులు జరిగినట్లు వివరించింది. విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ, ముఖ్యంగా ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నియమాలు అమలులోకి రావడం వల్ల ఈ గందరగోళం జరిగినట్లు తెలిపింది. రాబోయే 48 గంటల్లో తమ షెడ్యూల్‌లలో సర్దుబాట్లు చేసి, కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని ఇండిగో భరోసా ఇచ్చింది. ఏవియేషన్ వాచ్‌డాగ్ అయిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రకారం, నవంబర్‌లో ఇండిగో రద్దు చేసిన మొత్తం 1,232 విమానాలలో, 755 విమానాలు సిబ్బంది, ఎఫ్డీటీయల్ పరిమితుల కారణంగా రద్దు అయ్యాయి. నవంబర్‌లో ఇండిగో ఆన్‌టైమ్ పనితీరు 67.7 శాతానికి పడిపోయింది, అక్టోబర్‌లో ఇది 84.1 శాతంగా ఉంది. ఈ పరిస్థితులపై డీజీసీఏ వెంటనే స్పందించింది. విమానయాన సంస్థ అధికారులను గురువారం సమావేశానికి పిలిచింది. ఈ సమస్యకు గల కారణాలను, అలాగే రద్దులు, ఆలస్యాలను తగ్గించడానికి చేపట్టిన ప్రణాళికలను సమర్పించాలని ఇండిగో అధికారులను డీజీసీఏ ఆదేశించింది.




# 87 లోన్ యాప్స్ బంద్.. కేంద్రం కీలక నిర్ణయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

లోన్ యాప్స్ ఆగడాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 87 అక్రమ లోన్ యాప్ లను బ్యాన్ చేసింది. డేటా దుర్వినియోగంతో పాటు మోసం, వేధింపులకు పాల్పడుతున్నారనే కారణంతో వాటిపై నిషేధం విధించింది. ఐటీ చట్టంలోని 2000లోని 69A సెక్షన్ల ఆధారంగా బ్యాన్ విధించినట్లు తెలిపింది. ఈ విషయాన్ని కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లోకసభలో అధికారికంగా ప్రకటించారు. అయితే బ్యాన్ చేసిన వాటిల్లో ఆర్‌బీఐ అనుమతితో నడుస్తున్న యాప్‌లు కూడా ఉండడం విశేషం. బలవంతంగా రుణదాతల నుంచి వసూలు చేయడం, దోపిడీకి పాల్పడటంతో ప్రజల ఆందోళనలను తొగించేందుకు అక్రమ కార్యకలాపాలకు పాల్పడే యాప్‌లను తొలగించారు. ఏఐ వినియోగం, కంపెనీల లేఆఫ్స్ తో వ్యక్తుల ఆర్థిక పరిస్థితి దిగజారింది. దీనితో లక్షల మంది ఉద్యోగాలు కోల్పోవడం, ఉపాధి తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది. అప్పులు చేయాల్సి వస్తోంది. బ్యాంకుల్లో అప్పులు దొరకడం కష్టం కావడంతో సామాన్యులు ఆన్ లైన్ లోన్ యాప్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీటిల్లో అధిక వడ్డీ, సర్వీస్ ఛార్జీల రూపంలో వేలకు వేలు వసూలు చేస్తున్నా దిక్కుతోచని పరిస్థితుల్లో అప్పులు తీసుకుంటున్నారు. ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేకుండా నిమిషాల్లో డబ్బులు అకౌంట్లో పడుతుండటంతో లోన్ యాప్స్ కు ఆదరణ పెరుగుతోంది. కానీ తిరిగి డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో రుణదాతలను లోన్ యాప్స్ నిర్వహాకులు బ్లాక్ మెయిల్ చేయడం, వేధించడం లాంటివి చేస్తున్నారు. వీరి బాధ తట్టులేక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు కూడా ఉన్నారు. దీనితో కేంద్రం ఈ సంచలన నిర్ణయం తీసుకుంది.




## హెచ్-1బీ వీసాపై ట్రంప్ సర్కార్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం , హెచ్ 1బీ వీసా జారీపై మరింత కఠినంగా వ్యవహరించనుంది. వైట్ హౌస్ అధికారికంగా ఈ ఆంక్షలను తీసుకొచ్చింది. హెచ్ 1బీ వీసా దరఖాస్తుదారులు, వారి H4 వీసా డిపెండెంట్ల సోషల్ మీడియా ఖాతాలను అమెరికా ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఇప్పటికే హెచ్ 1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ సర్కార్ వెట్టింగ్ నిబంధనలు మరింత కఠినతరం చేసింది. కొత్త నిబంధనల వల్ల వీరంతా తమ సామాజిక మాధ్యమ ఖాతాల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్ మోడ్‌లోకి మార్చాల్సి ఉంటుంది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 15 నుంచి ఇది మొదలుకానుంది. ఈనెల డిసెంబర్ 2న అన్ని అమెరికా దౌత్య కార్యాలయాలకు అమెరికా స్టేట్ డిపార్ట్ మెంట్ మెమోను జారీ చేసింది. హెచ్ 1బీ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారి లింక్డిన్ పేజీలు, రెజ్యూమోలను సమీక్షించాలని పేర్కొంది. వాక్ స్వాతంత్ర్యం అణచివేసేలా సెన్సార్‌షిప్‌ను అమలు చేసేందుకు గతంలో పనిచేసినట్లు తేలినా వారి వీసాలను తిరస్కరించవచ్చని స్టేట్ డిపార్ట్ మెంట్ జారీ చేసిన మెమో వెల్లడి చేస్తోంది. హెచ్ 1బీతోపాటు హెచ్4 వీసాదారుల రెజ్యూమో, లింక్డిన్ ప్రొఫైళ్లను సమీక్షించాలి. వారు అసత్య ప్రచారం, కంటెంట్ నియంత్రణ, ఫ్యాక్ట్ చెకింగ్, ఆన్‌లైన్ సేఫ్టీ వంటి విభాగాల్లో పని చేశారా? అని గమనిస్తారు. విద్యార్థులు, ఎక్స్చేంజ్ విజిటర్లపై ఇప్పటికే దీన్ని అమెరికా అమలు చేస్తోంది. ఇప్పుడు H1B,H4 వీసాదారులకు కూడా ఇది వర్తింపజేయనున్నారు. ఈ వీసాలకు దరఖాస్తు చేసుకున్నవారు తమ సోషల్ మీడియా ఖాతాల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్ చేయాలని యూఎస్ యంత్రాంగం ఆదేశించింది.

**సోషల్ మీడియా వెట్టింగ్ అంటే ?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా, లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేస్తారు. దీనినే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే, ఉగ్రవాదులను నియంత్రించడం, యూదు వ్యతిరేకతను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ తనిఖీ చేయనున్నట్లు గతంలోనే అగ్రరాజ్యం వెల్లడించింది. యూఎస్ వీసా అనేది ఒక ప్రత్యేక అర్హత అని, అదొక హక్కు కాదని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. దేశ భద్రతకు ముప్పు కలిగించే దరఖాస్తుదారుల్ని గుర్తించేందుకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని స్క్రీనింగ్ చేస్తామని పేర్కొంది. ఇది జాతీయ భద్రతా నిర్ణయమని వెల్లడించింది. యూఎస్ కంపెనీలు నిపుణులైన కార్మికులను నియమించుకునేందుకు హెచ్ 1బీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. ఈ వీసాల ద్వారా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నవారిలో ఎక్కువమంది భారత్, చైనాకు చెందినవారే. అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్ 1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, హెచ్ 1బీ వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ స్పష్టతనిచ్చింది. అలాగే అమెరికాలో చదువుకొని, ఉద్యోగాల కోసం హెచ్ 1బీ వీసాకు దరఖాస్తు చేసుకొనే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది.



## చర్చలు ఓకే... పుతిన్ వార్ ఆపండి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఉక్రెయిన్ శాంతి ప్రణాళికపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా ప్రతినిధి బృందం చర్చలు బాగా జరిగాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఆ చర్చలు తర్వాత పుతిన్ యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నారనే ఒక భావన కలిగిందని ఆయన చెప్పారు. ఓవల్ ఆఫీస్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశం నిర్వహించారు. 'జేర్డ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్‌తో పుతిన్ చాలా మంచి చర్చ సమావేశం నిర్వహించారు. ఎందుకంటే ఇది ఇద్దరూ కలిసి చేయాల్సిన ప్రక్రియ. అయితే పుతిన్ మాత్రం యుద్ధాన్ని ముగించాలని కోరుకుంటున్నారు. ఇదే వారి అభిప్రాయం'అని ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మాస్కోలో మళ్లీ ఐదు గంటల పాటు సుధీర్ఘ చర్చలు జరిపారు. ఇదిలాఉండగా, ఈ చర్చల్లో ఉక్రెయిన్ నాటోలో చేరాలనే చేస్తున్న ప్రయత్నం కీలకంగా మారిందని పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ వివరించారు. ఐదు గంటల పాటు జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి సాధించలేకపోయినా కీవ్ నాటో సభ్యత్వం ప్రధానంగా చర్చించామని ఆయన పేర్కొన్నారు. 'మా పరిగణనలను, కీలక ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవడానికి అమెరికా భాగస్వాములు సిద్ధంగా ఉన్నారని వారు ధృవీకరించారు. భూభాగ సంబంధిత అంశాల్లో ఎటువంటి రాజీ కుదరలేదని, యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా, రష్యా మధ్య జరిగిన అత్యంత విస్తృత చర్చలలో ఒకటి. రెండు పక్షాలు శాంతి కోసం పలు మార్గాలను పరిశీలించినప్పటికీ, ప్రధాన విభేదాలు అలాగే ఉన్నాయి. బుధవారం రాత్రివేళ వరకు చర్చలు నడచాయి. అమెరికా ప్రతినిధులు కొత్త ప్రతిపాదనలు సమర్పించినప్పటికీ, ప్రధాన చిక్కులు ఉన్నాయి' అని ఉషకోవ్ వ్యాఖ్యానించారు.

**చర్చల కోసం ఎదురుచూస్తున్నాం : జెలెన్**

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో డోనాల్డ్ ట్రంప్ రాయబారులు జరిపిన చర్చలపై సత్వర నివేదిక కోసం తాము ఎదురుచూస్తున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. అమెరికా నుంచి వచ్చే సంకేతాలపైనే తమ తదుపరి అడుగులు ఆధారపడి ఉంటాయని ఐర్లాండ్ పర్యటనలో ఉన్న ఆయన తెలిపారు. ఈ యుద్ధాన్ని పరిష్కరించడానికి ట్రంప్ ప్రతినిధులు మాస్కోలో ఉన్నారని, కానీ అది అంత సులువు కాదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పారు. ఉక్రెయిన్, యూరోపియన్ ప్రభుత్వాల ఆందోళనలను పరిగణలోకి తీసుకుంటూ శాంతి ప్రణాళికను సవరించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన వివరించారు.

**ట్రంప్ 28 సూత్రాల ప్రణాళిక**

మూడేళ్లకు పైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ట్రంప్ ఈ 28 సూత్రాలను రూపొందించారు. వీటిలో రష్యాకు అనుకూలంగా ఉన్న అంసాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందులో భాగంగా దొనెట్స్క సహా పలు కీలక ప్రాంతాలను కీవ్ వదులుకోవాల్సి ఉంటుంది. ఉక్రెయిన్ తన సైనిక శక్తిని తగ్గించుకోవాలి. భద్రతా ఏర్పాట్లు, భూభాగ హామీలపై పెద్ద మార్పులు చేయాలి అయితే యుద్ధంతో దెబ్బతిన్న ఉక్రెయిన్ మౌలిక వసతుల పునర్నిర్మాణానికి భారీ సహాయం అందించే అంశాలను కూడా ఈ ప్యాకేజీలో చేర్చారు. దీనిపై ఉక్రెయిన్తో సహా ఐరోపా దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## యూకేను వీడిన 74 వేల మంది విద్యార్థులు




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**ఇంగ్లాండ్ వీసా నిబంధనల కఠినతరం, వర్సిటీల ఫీజుల్లో భారీ పెరుగుదల భారతీయ విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం 2025 జూన్ నాటికి యూకేను వీడిన భారతీయ విద్యార్థుల సంఖ్య 74 వేల మార్క్ దాటింది. చదువు, ఉపాధి అవకాశాలపై అనిశ్చితి పెరగడంతో విద్యార్థులు తిరిగి భారత్ మార్గం పట్టే పరిస్థితి కలిగింది.**

2024 జనవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనల ప్రకారం పీజీ విద్యార్థులు తమ డిపెండెంట్స్ ను యూకేకి తీసుకురావడానికి అనుమతి లేదు. ఈ మార్పుతో డిపెండెంట్ వీసా దరఖాస్తులు ఒకేసారి 86% వరకు క్షీణించాయి. అదేవిధంగా, భారతీయ విద్యార్థుల నుంచి వచ్చే కొత్త స్టూడెంట్ వీసా దరఖాస్తుల్లోనూ 11% తగ్గుదల నమోదైంది. వీసా కేటగిరీల పునర్వ్యవస్థీకరణ, హెల్త్ సర్‌చార్జ్ పెంపు, వీసా ఫీజుల పెరుగుదల వంటి అంశాలు విద్యార్థులను మరింత ఒత్తిడిలోకి నెడుతున్నాయి. యూకే లోకల్ ఉద్యోగ మార్కెట్ కఠినతరం కావడం, గ్రాడ్యుయేట్ వర్క్ వీసా భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనడం కూడా భారతీయుల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యార్థులకు ప్రధాన గమ్యస్థానంగా ఉన్న యూకే, ఇప్పుడు అధిక వ్యయం-తక్కువ అవకాశాల ప్రాంతంగా మారుతున్నదన్న భావన బలపడుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఐర్లాండ్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. వీసా సౌలభ్యం, తక్కువ ఫీజులు, ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఈ మార్పుకి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

## విశ్వ కుబేరుడి రాజప్రసాదం .. హైదరాబాద్ హౌస్ కహానీ !

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత దేశ రాజధాని ఢిల్లీలో విదేశీ అతిథులకు ఆతిథ్యం ఇచ్చే అత్యంత కీలకమైన భవనం ఏదంటే అందరికీ గుర్తొచ్చేది హైదరాబాద్ హౌస్. అనాడు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరుగాంచిన హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తన దర్పాన్ని, వైభవాన్ని చాటుకోవడానికి కట్టించిన భవనమే ఇదని చాలా మందికి తెలియదు.



బ్రిటిషర్లు కలకత్తా నుంచి ఢిల్లీకి రాజధానిని మార్చినప్పుడు, కొత్త రాజధానిలో తమదైన ముద్ర వేయాలని దేశంలోని సంస్థానాధీశులు భావించారు. ఈ క్రమంలోనే, హైదరాబాద్ నిజాం ఢిల్లీలో ఓ రాజభవనం నిర్మించాలని సంకల్పించారు. వైస్రాయ్ హౌస్‌కు (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) దగ్గరలోనే స్థలం కావాలని ఆయన పట్టుబట్టారు. కానీ, బ్రిటిష్ ప్రభుత్వం అందుకు నిరాకరించింది. కింగ్స్ వే సమీపంలోని ప్రిన్సెస్ పార్క్ లో హైదరాబాద్, బరోడా, జైపూర్ వంటి ఐదు సంస్థానాలకు స్థలాలను కేటాయించారు. నిజాం, వైస్రాయ్ హౌస్‌ను డిజైన్ చేసిన ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుట్యెన్స్ భవన నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. వైస్రాయ్ హౌస్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా తన భవనం ఉండాలని నిజాం కోరినప్పటికీ, ప్రభుత్వ నిబంధనల మేరకు అది సాధ్యపడలేదు. ఆర్కిటెక్ట్ లుట్యెన్స్ దీన్ని సీతాకోకచిలుక ఆకారంలో (బటర్‌ఫ్లై షేప్) అద్భుతంగా డిజైన్ చేశారు. 1920లలో సుమారు 2 లక్షల పౌండ్ల భారీ వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో 36 గదులు, విశాలమైన ప్రాంగణాలు, యూరోపియన్, మొఘల్ శైలుల మేళవింపుతో కూడిన వాస్తుశిల్పం కనిపిస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత, 'ఆపరేషన్ పోలో'తో హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమయ్యాక, ఈ భవనం ప్రాభవాన్ని కోల్పోయింది. నిజాం రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. దీని యాజమాన్యం భారత ప్రభుత్వానికి బదిలీ అయింది. 1974లో విదేశాంగ మంత్రిత్వ శాఖ దీన్ని స్వాధీనం చేసుకుని, ప్రధాని అధికారిక అతిథి గృహంగా మార్పు చేసింది. అప్పటి నుంచి అమెరికా అధ్యక్షుల నుంచి రష్యా అధినేతల వరకు ప్రపంచ దేశాధినేతలకు సమావేశాలు, విందుల కోసం ఈ భవనాన్నే వినియోగిస్తున్నారు. ఒకప్పుడు నిజాం దర్బారుకు ప్రతీకగా నిలిచిన ఈ భవనం, నేడు భారతదేశ దౌత్య సంబంధాలకు కేంద్ర బిందువుగా మారింది.

## లానినా 55 శాతం మాత్రమే.. డబ్ల్యూఎంఓ వెల్లడి




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**ప్రపంచ వాతావరణ సంస్థ కీలక సమాచారంలో భాగంగా, రానున్న మూడు నెలల పాటు లానినా పరిస్థితులు కేవలం 55 శాతం మాత్రమే ఉండే అవకాశం ఉన్నట్లు డబ్ల్యూఎంఓ పేర్కొంది. లానినా వల్ల ప్రపంచవ్యాప్తంగా వెదర్, వాతావరణ పరిస్థితులపై ప్రభావం పడనున్నది.**

లానినా వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తాత్కాలికంగా శీతలంగా ఉండే అవకాశం ఉంది. అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వేడి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని యూఎన్ ఏజెన్సీ పేర్కొంది . పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే విరుద్ధ వాతావరణ పరిస్థితులను లా నినా, ఎల్ నినోగా పిలుస్తారు. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్య రేఖకు అటూ ఇటూ ఉన్న ప్రదేశం శీతలంగా మారినప్పుడు లానినా పరిస్థితులు ఉద్భవిస్తాయి. శీతల గాలులు, పీడనం, వర్షం నమోదు అవుతాయి. ఎల్‌నినో పరిస్థితుల వల్ల రుతుపవనాలు తగ్గి, తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉంటాయి. మూడు నెలల శీతాకాలంలో సెంట్రల్ ఇండియాతో పాటు పశ్చిమ భారత్‌లో సాధారణం లేదా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు కొన్ని రోజుల క్రితం భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు లానినా పరిస్థితులు బలహీనంగా ఉంటాయని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది. నవంబర్ లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో లానినా పరిస్థితులు బోర్డర్‌లైన్ వద్ద ఉన్నాయని డబ్ల్యూఎంవో ప్రకటించింది. జనవరి నుంచి మార్చి వరకు 65 శాతం, ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు 75 శాతం వాతావరణ పరిస్థితి ఉండనున్నట్లు ప్రపంచ వాతావరణ శాఖ ప్రకటించింది.

## స్నేహితుడు వచ్చేశాడు..



**మొదటి పేజీ తరువాయి...**

**పుతిన్ కోసం ప్రోటోకాల్ పక్కన పెట్టిన ప్రధాని మోదీ**

పుతిన్ కోసం ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి మోదీ చూపిన ప్రత్యేక చొరవ, ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధానికి అద్దం పట్టింది. విమానం దిగిన వెంటనే ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. తరువాత ఇద్దరూ ఒకే కారు లో విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ దృశ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యానికి మించి ఇరువురు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధానికి, పరస్పర విశ్వాసానికి నిలువుటద్దంగా నిలిచింది.

**నేడు రాష్ట్రపతి తో పుతిన్ సమావేశం**

అధికారిక షెడ్యూల్ లో భాగంగా పుతిన్ శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతితో సమావేశం జరగనుంది . తర్వాత ఆయన మహాత్మా గాంధీకి నివాళులు అర్పించడానికి రాజ్‌ఘాట్‌కు వెళ్తారు. తర్వాత , దౌత్య చర్చలు జరిగే హైదరాబాద్ హౌస్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ హౌస్‌లో అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని మోదీ విందు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం మిగిలిన సమయం ఇరుదేశాల ప్రతినిధుల బృందాల మధ్య నిర్మాణాత్మక సమావేశాల కోసం కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

**భారత్ - రష్యా ద్వైపాక్షిక అంశాలపై ప్రత్యేక సమావేశం**


భారత్ రష్యా మధ్య రక్షణ సహకారం, ఇంధనం, వాణిజ్యం, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రాజెక్టులు వంటి ద్వైపాక్షిక అంశాలపై ప్రధానంగా ఇరుదేశాల ప్రతినిధుల బృందాల మధ్య నిర్మాణాత్మక సమావేశం జరగనుంది .రెండు దేశాల మధ్య కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించి, భాగస్వామ్యానికి సాధ్యమయ్యే కొత్త రంగాలపై చర్చిస్తాయి.రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన పరిశ్రమ వర్గాల దృష్టిని సైతం ఆకర్షించింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని వారు విశ్వసిస్తున్నారు. భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (FIEO) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రష్యాతో భారతదేశ వాణిజ్యం అసమానంగా ఉందని తెలిపారు. "గత సంవత్సరం మేము రష్యా నుండి సుమారు 63 బిలియన్ డాలర్లను దిగుమతి చేసుకున్నాము. మా ఎగుమతులు కేవలం 5 బిలియన్ డాలర్లు. ఈ వాణిజ్యం వక్రంగా ఉన్నందున, మనం దానిని సమతుల్యం చేసుకోవాలి మరియు వైవిధ్యపరచాలి" అని ఆయన స్పష్టం చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచడం, దిగుమతులుఎగుమతులను సమతుల్యం చేయడం, సాంకేతికత, పరిశ్రమలలో సహకారానికి కొత్త రంగాలను గుర్తించడంపై చర్చలు దృష్టి సారించాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పర్యటన వాణిజ్య సంబంధాలలో కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందని ఆశిస్తున్నారు.

**భారత్–రష్యా సంబంధాలు మరింత బలోపేతం : రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్**

ప్రపంచ రాజకీయాలలో ఉన్న అనిశ్చితి మధ్య కూడా భారత్-రష్యా సంబంధాలు మరింతగా పటిష్టమవుతున్నాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో రష్యా రక్షణ మంత్రి ఆంద్రీ బెలౌసోవ్‌తో కలిసి 22వ భారత్-రష్యా సైనిక, సాంకేతిక సహకారం అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశానికి సహాధ్యక్షత వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రష్యా భారత్‌కు ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామి అని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. రష్యా రక్షణ మంత్రి బెలౌసోవ్ కూడా ఇరుదేశాల మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, స్నేహంతో మరింత బలపడుతున్నాయని పేర్కొన్నారు.

**పుతిన్ ఆస్తి 200 బిలియన్ డాలర్ల ?**

భారత్ పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యక్తిగత సంపద మరోసారి చర్చనీయాంశమైంది. అధికారికంగా సాధారణ ప్రజా సేవకుడిగా, కేవలం 140,000 డాలర్ల వార్షిక జీతం , చిన్న అపార్ట్ మెంట్, కొన్ని వాహనాలే తన పేరుమీదున్నట్లు క్రెమ్లిన్ ప్రకటించినప్పటికీ, అంతర్జాతీయ అంచనాలు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పుతిన్ ఆస్తి దాదాపు 200 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. రూ.6,000 కోట్ల విలువైన సూపర్‌యాట్, నల్ల సముద్ర తీరంలోని బిలియన్ డాలర్ల 'పుతిన్ ప్యాలెస్' వంటి విలాసవంతమైన ఆస్తులు ఆయనకు పరోక్ష సంబంధం ఉన్నవిగా పేర్కొంటున్నారు. ఒలిగార్క్స్ పై ఒత్తిడి, విధేయులకు ప్రభుత్వ కాంట్రాక్టులు ఇచ్చి ముడుపులు తీసుకోవడం వంటి మార్గాల్లో పుతిన్ అపార సంపదను కూడబెట్టినట్లు అంతర్జాతీయ విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఆస్తులను నమ్మకస్తుల పేర్లలో దాచిపెట్టడమే ఆయన నిజమైన సంపదను అంచనా వేయడం కష్టతరం చేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించినా, రష్యా కుబేరుల సంపద పెరుగుతూనే ఉండడం గమనార్హం.



## అంతరిక్షం నుంచి వెలిగి పోతున్న మక్కా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగరం వెలుగులీనుతోంది. అంతరిక్షం నుంచి ఓ చిత్రం దేదీప్యమానంగా మక్కాలోని పవిత్ర కాబా నగరం ఆకర్షిస్తోంది. ఆ ఫొటోలో ప్రముఖ ఆరాధానాలయం వెలుగు దివ్వేల వలె మరింత శోభతో దర్శనమిస్తు వెలుగుతోంది.

వ్యోమగామి డాన్ పెటిట్.. ఐఎస్ఎస్ యాత్ర సందర్భంగా దానిని తన కెమెరాలో తీశారు. హై రిజల్యూషన్ నికాన్ కెమెరాతో తీసిన ఆ దృశ్యం ఇప్పుడు విశ్వవ్యాప్తంగా వైరల్ అవుతోంది. ''అంతరిక్షం నుంచి సౌదీ అరేబియాలోని మక్కా నగర దృశ్యమిది. మధ్యలో వెలుగులీనుతున్నది పవిత్ర కాబా గృహం. అది స్పేస్ నుంచి కూడా కనిపిస్తోంది'' అని పెటిట్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలా కళాత్మక చిత్రాలను క్లిక్‌మనిపించడంలో పెటిట్ దిట్ట. భూమికి సుమారు 400 కిలోమీటర్ల ఎత్తున ప్రయాణించే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఉండే కుపోలా విండో నుంచి దీనిని చిత్రించారు. వ్యోమగాములు అక్కడికి చేరుకొన్నప్పుడు పుడమి, విశ్వం సౌందర్యాన్ని చూసి మైమరిచిపోతారు. కుపోలా.. అంటే ఇటాలియన్ భాషలో డోము అని అర్థం. పవిత్ర మక్కా చిత్రాన్ని చూసిన ప్రతిఒక్కరు ముగ్ధులైనట్లు వ్యాఖ్యల రూపంలో స్పందిస్తున్నారు.

## ఇమ్రాన్ విముక్తికి మునీర్‌పై ఒత్తిడి


**మొదటిపేజీ తరువాయి....**

బలూచిస్తాన్ సహా పలు ప్రాంతాల్లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనకు పాక్ సైన్యమే కారణమని ఆరోపణలు ఉన్నాయంటూ లేఖలో ప్రస్తావించారు. పాక్ లో మానవ హక్కుల ఉల్లంఘనలు, అతిగా అధికార ప్రయోగం, ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో పెట్టడం, 2024 ఎన్నికల్లో హింస, అమెరికాలోని పౌరులపై దాడులు వంటి ఆరోపణలపై అమెరికా ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిం మునీర్ సహా పలు అధికారులపై గ్లోబల్ మాగ్నిట్స్కీ చట్టం కింద వీసా నిషేధాలు, ఆస్తి జప్తు, ఆర్థిక ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలు యూఎస్ -పాక్ సంబంధాల్లో ఉద్రిక్తత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు లేఖలో మునీర్, ఇతర పాకిస్తాన్ అధికారులు యూఎస్ పౌరులు, రెసిడెంట్లు పాక్ మిలిటరీని విమర్శిస్తే వారి కుటుంబాలపై దాడులు చేస్తున్నారని కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూఎస్ పౌరులపై జరుగుతున్న దాడులకు అమెరికా ప్రభుత్వం సరైన ప్రతిస్పందన ఇవ్వకపోవడంపై కూడా వారు అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇటీవలి యూఎస్ -పాక్ సమావేశాల్లో ఈ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇమ్రాన్ ఖాన్ వంటి రాజకీయ ఖైదీల విడుదలకు ఏ చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. పాకిస్తాన్‌లో అధికార దుర్వినియోగం పెరుగుతుండడంతో విపక్ష నాయకులు, జర్నలిస్టులు, సామాన్య పౌరులు లక్ష్యంగా మారుతున్నారని కాంగ్రెస్ సభ్యుల లేఖలో పేర్కొన్నారు. మార్చి 2025లో ప్రవేశపెట్టిన పాకిస్తాన్ డెమొక్రసీ యాక్ట్‌కు ఇది కొనసాగింపుగా వచ్చింది. ఆ బిల్లులో మునీర్‌ను రాజకీయ వ్యతిరేకులపై తప్పుడు కేసులు, శిక్షలకు బాధ్యులుగా గుర్తిస్తూ, 180 రోజుల్లో ఆంక్షలు విధించాలని ప్రతిపాదించారు. ఆగస్ట్ 2023 నుంచి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ రాజకీయ ఖైదీగా పరిగణించబడుతున్నారంటూ ఆయన విడుదలపై అమెరికా ఒత్తిడి కొనసాగుతోంది. ఈ లేఖను పాక్ ప్రభుత్వం, మిలిటరీ తమ సార్వభౌమత్వంపై దాడిగా పేర్కొంటూ ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేసే ప్రశ్నే లేదని స్పష్టం చేశాయి. అయితే ఇమ్రాన్‌ను వదిలిపెట్టకపోతే పాక్‌పై అమెరికా ఆంక్షలు విధించే అవకాశం ఉన్నట్లు అంచనా వేయబడుతోంది.

## కారు చౌకగా ఉగ్రవాద మహిళలకుశిక్షణ రూ. 500లకే జైషే ప్యాకేజ్

**మొదటిపేజీ తరువాయి....**

కేవలం 500 రూపాయల ఫీజుతో 40 నిమిషాల పాటు ఆన్ లైన్ శిక్షణ ఇచ్చే దిశగా, కొత్త సిలబ్ ను రూపొందించాడు. అక్టోబరు 8 నుంచి జైషే ప్రధాన కార్యాలయంలో ఈ మహిళా బ్రిగేడ్ కోసం నియామకాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి . పురుష ఉగ్రవాదుల తరహాలోనే మహిళా ఉగ్రవాదులకు కఠిన శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం. పాకిస్తాన్ లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, కొట్లీ, ముజఫరాబాద్ ప్రాంతాల నుంచి మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేర్చుకున్నట్లు తెలుస్తోంది. వీరికి ప్రతిరోజూ 40 నిమిషాల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ అందిస్తూ, ఆత్మాహుతి దాడులను చేపట్టేలా ప్రేరేపిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఒక్కో మహిళ నుంచి రూ.500 చొప్పున విరాళాల కింద సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ నియామక ప్రక్రియలో భాగంగా శిక్షణను సులభతరం చేయాలని, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ అంతటా జిల్లా స్థాయి సంస్థలను ఏర్పాటు చేయాలని జైషే పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి జిల్లాలో ఒక మహిళా ఉగ్రవాది నేతృత్వంలో ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ బ్రిగేడ్‌లో చేరే మహిళలకు అత్యంత కఠిన నియమాలు అమలులో ఉన్నాయి. భర్త లేదా కుటుంబసభ్యుడు తప్ప, మరే ఇతర పురుషుడితోనూ మాట్లాడకూడదని స్పష్టమైన ఆంక్షలు విధించినట్లు సమాచారం. ఈ మహిళా విభాగానికి మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నాయకురాలిగా వ్యవహరిస్తుండగా, ఆన్‌లైన్ క్లాసులకు పుల్వామా ఉగ్రదాడుల సూత్రధారి ఉమర్ ఫరూఖ్ భార్య అఫీరా బీబీ నేతృత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. 2019 మార్చిలో కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమర్ హతమవ్వగా, అంతకు ముందు ఆపరేషన్ సిందూర్ సమయంలో బహావల్‌పూర్‌లోని జైషే కేంద్రంపై జరిగిన దాడుల్లో మసూద్ కుటుంబానికి చెందిన పది మంది మృతి చెందారని గుర్తుచేశారు. ఈ దెబ్బ నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తున్న అజార్ ముఠా, కొత్త పన్నాగాలకే శ్రీకారం చుట్టిందని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. జైషే మహిళా విభాగం ఏర్పాటు పాక్ ఉగ్రవాద రంగంలో గణనీయమైన మార్పును సూచిస్తోందని విశ్లేషకులు తెలిపారు. తీవ్రవాద కార్యకలాపాల్లో మహిళల వినియోగం కొత్త వ్యూహాలకు నాంది పలుకుతోందని అభిప్రాయపడ్డారు.



# గ్లోబల్ సమ్మిట్ లో కీరవాణి కచేరి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ప్రత్యేక సంగీత కచేరితో ప్రేక్షకులను అలరించనున్నారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8న ప్రారంభమయ్యే ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి పాల్గొనే ప్రతినిధులకు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే విభిన్న కళారూపాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో 90 నిమిషాలపాటు కీరవాణి సంగీత కచేరి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రముఖ వీణా విద్వాంసురాలు పి. జయలక్ష్మి వీణా ప్రదర్శన, కళా కృష్ణ ఆధ్వర్యంలోని పేరిణి నృత్యం, ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు మాయాజాలం కూడా ఈ కార్యక్రమానికి విశేష రంగులద్దనున్నాయి. అదేవిధంగా, తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించే జానపద కళారూపాలు సందడి చేయనున్నాయి. కొమ్ము కోయ, బంజారా నృత్యం, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల దప్పులు, పేరిణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 10 నుండి 13 వరకు జరుగనున్న ఈ సంబరాలను ప్రజలందరూ వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుండగా, నాలుగు రోజుల పాటు నిరంతర మ్యూజికల్ ఆర్కెస్ట్రా సందడి చేయనుంది .




# అవినీతి అనకొండ మన సీఎం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సీఎం రేవంత్ రెడ్డి అవినీతి అనకొండలాంటివారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు . పారిశ్రామిక భూములను చౌకధరకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ భారీ భూకుంభకోణానికి పాల్పడుతున్నారని ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు చేశారు .

పారిశ్రామిక భూముల బదిలీపై బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు కొనసాగిస్తున్నాయి . ఈ నేపథ్యంలో కేటీఆర్ జీడిమెట్ల పారిశ్రామికవాడలో గురువారం పర్యటించి హమాలీలతో మాట్లాడారు. గత ఆరు నెలలుగా భూముల దోపిడీ జరుగుతోందని, తాజాగా పాలసీ రూపంలో ప్రభుత్వ అసలు ఉద్దేశం బహిర్గతమైందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, సుమారు రూ.5 లక్షల కోట్ల విలువైన భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాడుతుందని చెప్పారు . ఆషాఢం సేల్‌లా ఇచ్చే ఈ ఆఫర్లను నమ్మి పారిశ్రామికవేత్తలు మోసపోవద్దని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ భూకుంభకోణంలో భాగస్వాములు కావొద్దని , మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూములన్నింటినీ వెనక్కి తీసుకుంటామని చెప్పారు . రేవంత్ రెడ్డి అవినీతి అనకొండలాంటివారని , ఢిల్లీకి మూటలు పంపడానికి, దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు . ఎవరి ప్రయోజనాల కోసం భూములను ధారాదత్తం చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు.



# విదేశాల్లో చిక్కుకున్న యువతను రక్షించండి

**కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసి బంధీలుగా మార్చుతున్న గ్యాంగులను అరికట్టాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పార్లమెంటులో డిమాండ్ చేశారు.

గురువారం లోక్ సభలో మాట్లాడిన ఆయన, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల యువతను థాయ్‌లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని వివరించారు. అక్కడికి చేరుకున్న వెంటనే వారి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని హింసిస్తున్నారని తెలిపారు. ఈ నేరాలకు స్థానిక మిలీషియా, సైన్యంలో కొందరు లంచాలు తీసుకుని సహకరిస్తుండటం వల్ల రక్షణ చర్యలు మరింత క్లిష్టమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముఠాకు బలైనవారిలో నిజామాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు కూడా ఉన్నారని, వారు ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయి ఉన్నారని హౌస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, ఆ దేశాల్లో చిక్కుకున్న భారతీయులను రక్షించి స్వదేశానికి తీసుకువచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అర్వింద్ కోరారు.'

# మినీ కాశ్మీర్‌గా ఆదిలాబాద్‌ను మారుస్తాం

**ఆదిలాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**ఆదిలాబాద్‌ను రానున్న రోజుల్లో పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక వైభవం, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ప్రాంతాన్ని పర్యాటక రంగంలో మినీ కాశ్మీర్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.**




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆదిలాబాద్‌లో టూరిజం ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తృతంగా అభివృద్ధి చేస్తామని, దీంతో పెట్టుబడులు పెరిగి యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించబడతాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మార్చే సంకల్పంతో ప్రభుత్వం చురుకుగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అంతకుముందు మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, తన రాజకీయ ప్రయాణంలో జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, చివరికి ముఖ్యమంత్రిగా ఎదగడానికి ప్రజల ఆశీర్వాదం, దేవుని కృపే కారణమని అన్నారు. ప్రజల గౌరవాన్ని నిలబెట్టేందుకు నిరంతరం పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల పాలనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగానని, అభివృద్ధి పనుల్లో పార్టీల మధ్య తేడాలు లేకుండా అందరినీ కలుపుకునే విధానానికే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ నగేశ్ బీజేపీకి చెందిన వారైనా, వారితో కలిసి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్టు రేవంత్ పేర్కొన్నారు.

# 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో తొలివిడత ఎన్నికల్లో 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 39 గ్రామాలు, ఆదిలాబాద్ జిల్లాలో 33 గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో ఇప్పటిరవరకు 9331 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.




గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మొదటి విడత, రెండో విడత నామినేషన్లు పూర్తి కావడం, మూడో విడత నామినేషన్లు ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంది. నామినేషన్లు ఒక వైపు, నామినేషన్ వేసిన వారిని బరిలో నుంచి తప్పించే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఫలానా అభ్యర్థి బరిలో ఉంటే తమ గెలుపు ఓటములపై ప్రభావం చూపుతుందని గుర్తించిన కొందరు.. ప్రత్యర్థి అభ్యర్థులను బరిలో నుంచి తప్పించే పనిలో నిమగ్నమయ్యారు. అందుకోసం బుజ్జగింపులు, బేరసారాలు చేస్తున్నారు. అప్పటికీ వినకుంటే బెదిరింపులకు దిగుతున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా అభ్యర్థులను బరిలో నుంచి తప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రధానంగా బరిలో నిలిచిన అభ్యర్థి సామాజిక సమీకరణాలు, ఓట్లు విడిపోతే నష్టపోతామని ఎదుటి వారికి అర్థం అయ్యేలా చెబుతూ తమ లక్ష్యాన్ని వివరిస్తున్నారు. తాము రాజకీయంగా, సామాజికవర్గాల వారీగా నష్టపోతామని, రాక రాక రిజర్వేషన్ ఇప్పుడే తమకు అనుకూలంగా వచ్చిందని, రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఇది ఒక్కటే అవకాశమంటూ నామినేషన్‌వేసిన వారు విత్ డ్రా చేసుకోవాలని వేడుకుంటున్నారు.

# క్వాంటం ఎకానమీకి కేంద్రంగా హైదరాబాద్




**తెలంగాణ తొలి లాంగ్‌టర్మ్ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**భవిష్యత్తులో క్వాంటం ఎకానమీకి నాయకత్వం వహించే నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ గచ్చిబౌలిలో గురువారం జరిగిన నీతి ఆయోగ్ రోడ్‌మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ సమావేశంలో ఆయన మాట్లాడారు.**

క్వాంటం రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం, ప్రతిభా వనరులు హైదరాబాద్‌లో సమృద్ధిగా ఉండటంతో ఈ నగరం భవిష్యత్తులో ప్రపంచ క్వాంటం ఎకోసిస్టమ్‌లో కీలక కేంద్రంగా ఎదగనుందని భట్టి తెలిపారు. నీతి ఆయోగ్ రూపొందించిన క్వాంటం రోడ్‌మ్యాప్ 'తెలంగాణ రైజింగ్ 2047' దృష్టికోణానికి అనుగుణంగా ఉందని, 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇది పెద్దగా దోహదపడుతుందని చెప్పారు. క్వాంటం టెక్నాలజీ జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి, పరిశ్రమలు, కమ్యూనికేషన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ప్రతి రంగాన్నీ మార్చగల శక్తి కలిగివుందని, స్టార్టప్స్ అభివృద్ధిలో కూడా ఇది ప్రధాన పాత్ర పోషించబోతుందని భట్టి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సభ్యులు వీకే సారస్వత్, దేబ్జాని ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఐఐఐటీ-హైదరాబాద్, ఐఐటీ-హైదరాబాద్, సీఆర్ రావు ఇన్‌స్టిట్యూట్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారి దీర్ఘకాలిక క్వాంటం వ్యూహాన్ని రూపొందించిన రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచ రూపును మార్చినట్లే రాబోయే దశాబ్దాల్లో క్వాంటం టెక్నాలజీ కూడా విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుందని తెలిపారు. ఏఐ, క్వాంటం వంటి కటింగ్‌ఎడ్జ్ టెక్నాలజీల్లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా చేయాలన్న లక్ష్యంతో, రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఈ రంగంలో దేశానికి బెంచ్‌మార్క్ గా నిలిచేలా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేశామని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్ మరియు వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం అందించేందుకు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రతి వారంలో ఒక రోజు అధికారులతో, ప్రతి నెలలో ఒక రోజు తమతో పరిశ్రమల ప్రతినిధులు ప్రత్యక్షంగా సమావేశమయ్యే విధానానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

# కాలుష్య సమస్య రాకూడదనే హిల్ట్ పాలసీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఢిల్లీలో ఉన్న విధంగా హైదరాబాద్‌కు కాలుష్య సమస్య రాకూడదనేనని సీఎం ఆయన తెలిపారు. ఈ హిల్ట్ పాలసీ ఒక గొప్ప నిర్ణయమని కొనియాడిన మహేశ్ కుమార్ గౌడ్, ఈ పాలసీ వల్ల ప్రజలకు అందుబాటులోకి భూముల ధరలు వస్తాయని చెప్పారు. హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గురువారం కౌంటర్ ఇచ్చారు.

నిరుద్యోగుల పొట్ట కొట్టిన పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. పరిశ్రమలు హైదరాబాద్ నడిబొడ్డున ఉండటం వల్ల కాలుష్యం పెరుగుతోందని, అందుకే వాటిని ఔటర్ రింగ్ రోడ్ బయటకు తరలించి, వాటి స్థానంలో రెసిడెన్షియల్ ఏరియా చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, బీఆర్ఎస్‌లపై విమర్శలు చేశారు . గత పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌ను దోచుకుంటుంటే బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అలాగే, ముఖ్యమంత్రి ఒక సామెతలా మాట్లాడిన వ్యాఖ్యల్ని పట్టుకుని బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని,



కులం, మతం లేకుండా బీజేపీ వాళ్లకు పూట గడవదని విమర్శించారు. చివరగా, డీసీసీల ఎంపిక విషయంలో ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు.

# హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ పోరుబాట




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హిల్ట్ పాలసీపై ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర విమర్శలు వ్యక్తం చేశారు. పారిశ్రామిక భూములను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, కోట్ల రూపాయలను దోచుకునేందుకు భూముల విలువను ఉపయోగిస్తున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. బహదూర్‌పూర్, చందూలాల్, బరదరి ఇండస్ట్రియల్ ఏరియాల్లో మాజీ మంత్రి మహమూద్ అలీతో కలిసి పర్యటించారు . హిల్ట్ పాలసీ పారిశ్రామిక రంగానికి, పెట్టుబడులకు, ఉపాధికి ముప్పు అని అన్నారు. ప్రజా సమస్యల పక్కనపెట్టి భూముల దోపిడీకి ప్రాధాన్యం ఇవ్వడం, పారిశ్రామిక రంగాన్ని నష్టపరచడం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రతికూల ప్రభావం చూపడం వంటి అంశాలను ఆయన వెల్లడించారు. దీంతో ప్రభుత్వం తక్షణమే హిల్ట్ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి స్వగ్రామంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

**ములుగు (ఏడీఎన్ఎన్) :**

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వగ్రామం ములుగు మండలంలోని జగ్గన్నపేటలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్రామ అభివృద్ధి,



ఐక్యతను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన చర్చల ద్వారా సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా అభ్యర్థి నిర్ణయించబడింది. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీ అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, స్థానిక నాయకులు మరియు పోటీదారుల సమాలోచనల ఫలితంగా మంత్రి సీతక్క సూచనల మేరకు అర్రెం వెంకన్న కాంగ్రెస్ మద్దతుతో ఏకగ్రీవ సర్పంచ్ అభ్యర్థిగా డిక్లేర్ అయ్యారు.

# ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్ తెస్తా..

మొదటిపేజీ తరువాయి....

చిన్న వయసులో తనకు గొప్ప అవకాశం దక్కడం ప్రజల దీవెన, దేవుడి సంకల్పమని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంటరీ రూపొందించామని, పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈ నెల 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా ఇంద్రవెల్లి స్ఫూర్తితోనే పోరాటం ప్రారంభించానని, అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటక అభివృద్ధి దస్త్రంపై సంతకం పెట్టానని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని, అది మూడేళ్లకే కూలిపోయిందని విమర్శించారు. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ఉత్సవం పూర్తయిన వెంటనే మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సభలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

TELANGANA RISING GLOBAL SUMMIT

# గ్లోబల్ సమ్మిట్‌కు సామాన్యులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సామాన్యులకూ ప్రవేశం కల్పించింది. ఈ నెల 10 నుంచి 13 వరకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పించారు. ప్రతిరోజూ ఎంజీబీఎస్ , జేబీఎస్ , కూకట్‌పల్లి, చార్మినార్ ఎల్బీనగర్ నుంచి సమ్మిట్‌కు ఉచిత బస్సులు సైతం ఏర్పాటు చేశారు.

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మీర్ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9వ తేదీల్లో టీ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మిట్‌ను దావోస్ సమ్మిట్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ తన బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవాలని, భవిష్యత్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా 500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీలు, 2000 పైగా వ్యాపారవేత్తలు, నాయకులు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# అక్రమాస్తుల కేసులో అవినీతి ఏడీ అరెస్ట్

**రంగారెడ్డి జిల్లా (ఏడీఎన్ఎన్) :**

రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారుల చేతికి గురువారం అరెస్ట్ చేశారు .ఆయన నివాసం సహా బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ బృందాలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నట్టు గుర్తించాయి. మొత్తం ఆరు చోట్ల జరిగిన దాడుల్లో రాయదుర్గం మైహోం భుజాలో ఒక ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురం జిల్లాలో మరో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ఎకరాల స్థలం, నారాయణపేటలో రైస్ మిల్లు, అదనంగా మూడు ఎకరాల భూమి కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అలాగే సోదాల్లో రూ.5 లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, రెండు కార్లు, పలు కీలక పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది.



# ప్రభుత్వాలు మారిన ఉప్పల్ ప్రజల తిప్పలు తీరడం లేదు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఉప్పల్ ఫ్లై ఓవర్ నిర్మాణం ఎనిమిది సంవత్సరాలుగా కొనసాగుతోందని, ప్రభుత్వాలు మారుతున్నా ఉప్పల్ ప్రజల పరిస్థితి మారటం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల విమర్శించారు . ఉప్పల్ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను కవిత గురువారం పరిశీలించారు .

నిర్మాణ పనుల ఆలస్యానికి గల కారణాలను అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను శాసన మండలిలో ఈ అంశాన్ని ప్రశ్నించినప్పుడు మంత్రి కోమటి రెడ్డి స్పందించి, త్వరలోనే సమీక్ష చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా, ఆ తర్వాత కాంట్రాక్టర్‌ను మార్చారో లేదో తెలియదు కానీ, "ఎక్కడి గొంగళి అక్కడే" అన్నట్లుగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. జాగృతి జనం బాటలో భాగంగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి వచ్చామని, ఘట్‌కేసర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నిర్మిస్తున్న ఈ ఫ్లై ఓవర్ 8 ఏళ్లుగా కడుతున్నారంటే ప్రజల పట్ల ప్రభుత్వాల చిత్తశుద్ధి ఏమాత్రం ఉందో తెలుస్తోందని అన్నారు. ఈ ఆలస్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపమే కారణమని పేర్కొన్నారు . కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు పూర్తి చేయించాలని కోరారు. అలాగే, ఈ ప్రాంత ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే కూడా ఇక్కడికి వచ్చి నిరసన తెలిపి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, లేదంటే తమ సంస్థ తరఫున తామే ప్రభుత్వం వెంటపడి పనులు చేయిస్తామని కవిత అన్నారు .

## రాశి ఫలాలు

**05-12-2025 శుక్రవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాల్లో కూడా తీరిక లేని పరిస్థితి ఉంటుంది. వ్యాపారాల్లో పోటీదార్ల సమస్యలు బాగా తగ్గిపోతాయి. ఇంటా బయటా మీ మాటకు విలువ ఉంటుంది. ఆదాయానికి లోటుండదు. అదనపు ఆదాయ మార్గాలు సత్ఫలితాలనిస్తాయి.

**వృషభం:**
విదేశీయానానికి, విదేశాలలో స్థిరపడడానికి అవకాశాలు మెరుగుపడతాయి. అనుకోకుండా ధన యోగం పడుతుంది. సేవా కార్యక్రమాల్లోనూ, దైవ కార్యాల్లోనూ ఎక్కువగా పాల్గొంటారు. ఉద్యోగంలో ప్రాధాన్యం పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో అధికారుల నుంచి కొన్ని శుభవార్తలు అందుతాయి.

**మిధునం:**
వృత్తి, ఉద్యోగాల్లో పని భారం పెరిగే అవకాశం ఉంది. ఆదాయం కలిసి వస్తుంది కానీ, ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి. ఆహార, విహారాల్లో జాగ్రత్తగా ఉండడం మంచిది. కుటుంబ జీవితం చాలావరకు సామరస్యంగా సాగిపోతుంది. పిల్లలు వృద్ధిలోకి వస్తారు.

**కర్కాటకం:**
ఆదాయ ప్రయత్నాలన్నీ సత్ఫలితాలనిస్తాయి. పిల్లలు వృద్ధిలోకి వస్తారు. జీవిత భాగస్వామికి మంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి. నిరుద్యోగులకు సమయం అనుకూలంగా ఉంది. ఉద్యోగపరంగా విదేశాల నుంచి ఆశించిన సమాచారం అందుతుంది.

**సింహం:**
ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా చక్కబడతాయి. అదనపు ఆదాయ మార్గాలు సత్ఫలితాలనిస్తాయి. కుటుంబంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. పిల్లల నుంచి శుభ వార్తలు వింటారు. ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని సర దాగా కాలక్షేపం చేస్తారు.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాల్లో అధికారులు ప్రత్యేక బాధ్యతలను అప్పగిస్తారు. అధికారాలు పెరిగే అవకాశం ఉంది. వ్యాపారాల్లో విశ్రాంతి ఉండని పరిస్థితి ఏర్పడుతుంది. ఇంటా బయటా అనుకూల పరిస్థితులుంటాయి. ఆదాయం బాగా వృద్ధి చెందుతుంది.

**తుల:**
వృత్తి, వ్యాపారాల్లో లాభాలకు కొదవ ఉండదు. ముఖ్యంగా వృత్తి జీవితంలో డిమాండ్ పెరుగుతుంది. మిత్రులతో విందులో పాల్గొంటారు. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాల్లో ఒకటి రెండు శుభవార్తలు వింటారు. పిల్లలు వృద్ధిలోకి వస్తారు.

**వృశ్చికం:**
వృత్తి, వ్యాపారాల్లో శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువగా ఉంటుంది. ఉద్యోగ జీవితం ప్రశాంతంగా, సాఫీగా సాగిపోతుంది. ఆదాయం, ఆరోగ్యం నిలకడగా ఉంటాయి. పెళ్లి ప్రయత్నాలు సానుకూలపడతాయి. ఉద్యోగ ప్రయత్నాలకు సానుకూల స్పందన లభిస్తుంది.

**ధనస్సు:**
వృత్తి, వ్యాపారాల్లో ఒత్తిడి బాగా పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాల్లో వ్యయ ప్రయాసలు తప్పకపోవచ్చు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తవుతాయి. ఆదాయం చాలావరకు నిలకడగా ఉంటుంది. ఖర్చుల్ని తగ్గించుకోవడం మంచిది. ఇతరులకు సహాయం చేయాల్సి వస్తుంది.

**మకరం:**
సేవా, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సేవా, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబసమేతంగా కొన్ని ఇష్టమైన ఆలయాల్ని సందర్శిస్తారు. విదేశాల్లో ఉన్న పిల్లల నుంచి శుభ వార్తలు వింటారు.

**కుంభం:**
వ్యక్తిగత సమస్యలు కొద్దిగా ఇబ్బంది పెడతాయి. పిల్లల నుంచి ఆశించిన సమాచారం అందుతుంది. ఇంటా బయటా ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఆదాయం ఆశాజన కంగా ఉంటుంది. స్వల్ప అనారోగ్య సమస్యలుండవచ్చు. కొందరు స్నేహితులతో విందులో పాల్గొంటారు.

**మీనం:**
వృత్తి, వ్యాపారాలు బాగా అనుకూలంగా, లాభదాయకంగా సాగిపోతాయి. ముఖ్యమైన ఆదాయ మార్గాల మీద దృష్టి పెడతారు. కొత్త వ్యాపా రాలు లేదా కొత్త పెట్టుబడుల గురించి ఆలోచన చేస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఆశించిన శుభవార్తలు వింటారు.




### బీడీ కార్మికులను నోటి
## క్యాన్సర్ నుండి రక్షించండి

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లుపై రాజ్యసభలో ప్రసంగించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బీడీ కార్మికులు నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. నోటి క్యాన్సర్ నివారణకు మరియు ప్రజలు వ్యసనాలకు లోనుకాకుండా కేంద్రం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాక, తెలంగాణలో గౌడ కులస్తుల సంక్షేమం కోసం మద్యం దుకాణాల్లో 15 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల కల్తీ మద్యం, బ్లాక్ మార్కెట్, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అమ్మకాలు జరుగుతున్నందుకు సామాజిక సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వద్దిరాజు రవిచంద్ర తెలిపారు, సామాజిక సమస్యల కన్నా ఆర్థిక అంశాలను సమీక్షించే సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లుకు బీఆర్ఎస్ పార్టీ మద్దతునిస్తున్నదని స్పష్టం చేశారు.

## కిడ్నీ రాళ్లకు కారణం ఇదే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



కిడ్నీలలో రాళ్లు ఏర్పడానికి కారణం టమాటోలు తినడం వల్ల అని ఒక అపోహ ఉంది. పాలకూర, టమాటోలు వంటి ఆహారాల వల్ల కిడ్నీ స్టోన్స్ ఏర్పడతాయని అనుకుంటారు. అయితే ప్రపంచంలో అత్యధికంగా తినే కూరగాయలలో టమోటా ఒకటి. దీనివల్ల కిడ్నీ స్టోన్స్ ఏర్పడితే అందరిలో ఏర్పడాలని వైద్యులు కొట్టిపడేస్తున్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడే రాళ్లలో కాల్షియం ఆక్సలేట్ రాళ్లు సర్వసాధారణం. అయితే టమాటాల్లో ఆక్సలేట్ చాలా తక్కువగా ఉంటుంది. 100 గ్రాముల టమాటాల్లో కేవలం 5 మిల్లీగ్రాముల ఆక్సలేట్ మాత్రమే ఉంటుంది. స్టోన్స్ ఏర్పడడానికి కావల్సినంత ఆక్సలేట్ ఇందులో లేదు. కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కారణం అంతర్లీన ఆరోగ్య పరిస్థితి, కొన్ని ఎంజైమ్‌ల లోపం లేదా జీవక్రియ సమస్యలు కావచ్చు. వాటిలో ముఖ్యమైనవి కొన్ని ఉన్నాయి. డీహైడ్రేషన్ వల్ల కూడా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. అందుకే కిడ్నీల పనితీరు బాగుండాలంటే బాగా నీరు తాగమంటారు. రోజుకు కనీసం 2 నుండి లీటర్ల నుండి 3 లీటర్ల నీరు త్రాగడం తప్పనిసరి. యూరిక్ యాసిడ్, స్ట్రువైట్ రాళ్లు, సిస్టీన్ రాళ్లు వంటి ఇతర రకాల స్ఫటికాల వల్ల కూడా రాళ్లు ఏర్పడతాయి. కొన్ని మాంసాహార ఆహారాలు తినడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుందనే నమ్మకం కూడా తప్పు. యూరిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడితే, వైద్యులు మందులు సూచిస్తారు. ఆక్సలోసిస్ అనే అరుదైన జీవక్రియ రుగ్మత కారణంగా మూత్రపిండాలు శరీరం నుండి కాల్షియం ఆక్సలేట్ స్ఫటికాలను మూత్రం ద్వారా విసర్జించడం ఆపివేస్తాయి. ఇది కిడ్నీలు పనిచేయడం మానేయడానికి దారితీయవచ్చు. అయితే ఈ విషయంలో ఆహారం కంటే వైద్యుల సలహా, మందులే ప్రధాన పాత్ర పోషిస్తాయి. మీరు కిడ్నీ సమస్యలు లేదా డయాబెటిస్, అధిక రక్తపోటుతో బాధపడుతుంటే, ప్రోటీన్ తక్కువగా ఉన్న ఆహారాన్ని తినడం మంచిది.

### ఊబకాయంపై ప్రపంచ
## ఆరోగ్య సంస్థ కీలక ప్రకటన

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఊబకాయంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే దీనిని దీర్ఘకాలిక వ్యాధిగా పరిగణిస్తూ కీలక ప్రకటన చేసింది. ఇకపై కేవలం జీవనశైలి సమస్యగా కాకుండా, "దీర్ఘకాలిక, పునరావృతమయ్యే వ్యాధి"గా ప్రకటించింది. దీనికి కూడా డయాబెటిస్ లాగ దీర్ఘకాల చికిత్స అవసరమని పేర్కొంది. సెమాగ్లూటైడ్ వంటి GLP1 గ్లూకాగాన్‌లైక్ పెప్టైడ్1 ఔషధాలను ఊబకాయం ఉన్న పెద్దలకు ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం దీర్ఘకాలిక చికిత్సగా డబ్ల్యూహెచ్ వో సిఫార్సు చేసింది. ఈ మందులు కేవలం బరువు తగ్గించడమే కాకుండా, గుండె జబ్బులు, మధుమేహం నివారణ, కొవ్వు కాలేయం, రక్తపోటు అదుపు వంటి అనేక మెటబాలిక్, కార్డియోవాస్కులర్ ప్రయోజనాలను అందిస్తాయని పేర్కొంది. ఇంటెన్సివ్ బిహేవియరల్ థెరపీ, ఆహారం, వ్యాయామం, కౌన్సెలింగ్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆరోగ్య సంస్థ సూచించింది. భారత్‌లో నలుగురిలో ఒకరు స్థూలకాయులుగా ఉండటం, 2050 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటం ఆందోళన కలిగిస్తోందని, అందుకే చికిత్స అత్యవసరమని వెల్లడించింది. అయితే ఈ బరువు తగ్గే ఔషధాలు అధిక ధర, ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగా ఉండటం వల్ల అవసరమైన వారిలో కేవలం 10శాతం మందికే లభ్యం అవుతున్నాయి. ధరలను తగ్గించడానికి ప్రభుత్వాలు తగిన వాలంటరీ లైసెన్సింగ్ వంటి విధానపరమైన చర్యలు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ విజ్ఞప్తి చేసింది.



## ఆహారంలో 'హిడెన్ క్యాలరీ బాంబులు' ?



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

బరువు తగ్గే ప్రక్రియలో భాగంగా చాలామంది కష్టపడి వ్యాయామం చేస్తుంటారు. డైటింగ్ చేస్తుంటారు. కానీ అప్పుడప్పుడు 'ఛీట్ మీల్' పేరుతో కొన్ని ఆహార పదార్థాలు లాగించేస్తుంటారు. మన ప్లేట్‌లో మనకు తెలియకుండానే ఉండే ఇలాంటి 'హిడెన్ క్యాలరీ' బాంబుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటివల్ల బరువు మనకు తెలియకుండానే పెరిగిపోతుంటారు. సోడా, కోల్డ్ డ్రింక్స్, ప్యాక్డ్ ఫ్రూట్ జ్యూస్‌లు వంటి పానీయాలలో చాలా అధికంగా క్యాలరీలు ఉంటాయి. ఒక 300 మి.లీ బాటిల్‌లో 180 క్యాలరీస్ ఉండవచ్చు. అంటే దీనిలో ఎలాంటి పోషకాలు ఉండవు. రోజూ ఒకటి తాగితే నెలకి 4 వేల అదనపు క్యాలరీస్, దాదాపు అర కిలో నుంచి 1 కిలో కొవ్వు పెరుగుతుంది. కేకులు, పేస్ట్రీస్, మిఠాయిలు వంటి తీపి పదార్థాలు కూడా విపరీతంగా క్యాలరీలు కలిగి ఉంటాయి. ఒక చిన్న ముక్క క్రీమ్ కేక్‌లో 600 క్యాలరీస్, రిఫైండ్ షుగర్, క్రీమ్, బట్టర్ ఉంటాయి. పండగలు, పుట్టినరోజుల్లో తప్ప మిగతా రోజులు పూర్తిగా మానేయడమే మంచిదని చెప్తున్నారు వైద్యులు. ఫ్రెంచ్ ఫ్రైస్, పొటాటో చిప్స్ లాంటివి 150 గ్రాములు తింటే దానిలో 550 క్యాలరీస్ ఉంటాయి. ఇవి డీప్ ఫ్రై చేసినవి కాబట్టి ట్రాన్స్ ఫ్యాట్, సాచురేటెడ్ ఫ్యాట్ ఎక్కువ. ఒక్కసారి తింటే రెండు రోజుల వ్యాయామం వృధా అవుతుంది. ఒక చిన్న 100 గ్రాములు ఐస్ క్రీమ్ కప్ లోనే 350 క్యాలరీస్, 30 గ్రాముల షుగర్ ఉంటాయి . రాత్రిపూట టీవీ చూస్తూ తింటే ఇన్సులిన్ స్పైక్ అయి కొవ్వు నిల్వ ఇంకా ఎక్కువ అవుతుంది. మయోనీస్, క్రీమ్ బేస్డ్ సాసెస్ వంటి వాటిలో ఒక టేబుల్ స్పూన్ లో 100 క్యాలరీస్ ఉంటాయి. అందులో 90శాతం కొవ్వే ఉంటుంది. సలాడ్‌లో, బర్గర్‌లో, శాండ్విచ్‌లో కొద్దిగా వాడినా 300 క్యాలరీస్ ఒక్క సాస్ నుంచే వచ్చేస్తాయి. పిజ్జా, బర్గర్, పాస్తా వంటి ఆహారాలలో సాచురేటెడ్ ఫ్యాట్ ఉంటుంది. ఎందుకంటే వాటిలో మైదా, చీజ్ వాడతారు. 30 గ్రాముల చీజ్ లోనే 120 క్యాలరీస్ ఉంటుంది. 10 గ్రాముల ఒక మీడియం పిజ్జాలో 4 స్లైసెస్ చీజ్ ఉంటే 500 క్యాలరీస్ ఒక్క చీజ్ నుంచే వస్తాయి. ఇలాంటి ఆహారాలను కొన్నాళ్లు మానేసి, వాటి స్థానంలో బేక్డ్ స్వీట్ పొటాటో, నిమ్మరసం నీళ్లు, గ్రీక్ యాగర్ట్, తాజా పండ్లతో చేసిన స్మూతీలు ఎంచుకుంటే మీ బరువులో వచ్చే మార్పులను చూసి, మీరే ఆశ్చర్యపోతారని వైద్యనిపుణులు చెప్తున్నారు.

## నిరుద్యోగులకు శుభవార్త

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా ఉద్యోగ నియామకాలు, కొత్త నోటిఫికేషన్లు తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ, వివిధ శాఖలలో భారీ ఖాళీలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తారని ప్రకటించడం నిరుద్యోగులకు శుభవార్తగా మారింది. స్థానిక ఎన్నికలు పూర్తయిన వెంటనే ఈ నియామకాలకు సంబంధించిన వరుస నోటిఫికేషన్లు విడుదల అయ్యే అవకాశముంది. ప్రత్యేకంగా 'తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్



ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ 'లో మొత్తం 9,735 పోస్టులలో కేవలం 5,763 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో సుమారు 4,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెడ్ ఆఫీస్‌లో ఉన్న అడిషనల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీలతో పాటు జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీలు, హాస్టల్స్‌లో టీచర్లు, లెక్చరర్లు, వార్డెన్లు, వాచ్‌మెన్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. కొందరు ఉన్నతాధికారి ఒక్కోసారి రెండు లేదా మూడు పోస్టులకు అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుంది. రెగ్యులర్ పోస్టుల భర్తీకి నిధుల కొరత కారణంగా, సొసైటీ ఖాళీలను కాంట్రాక్టు లేదా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాలని ఫైనాన్స్ డిపార్ట్ మెంట్‌ను కోరింది. ఫైనాన్స్ శాఖ 4,000 పోస్టులకు అనుమతి ఇచ్చింది. స్థానిక ఎన్నికలు ముగియగానే గురుకుల సొసైటీలోని కీలకమైన 4,000 ఖాళీలతో పాటు, 40 వేల ఉద్యోగాల కోసం వరుస నోటిఫికేషన్లు జారీ కావచ్చనే అంచనాలు వున్నాయి.

### విజయవాడ-హైదరాబాద్‌కు
## వైడ్‌బాడీ విమానాలు



**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

విజయవాడ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వైడ్‌బాడీ విమాన సేవలను ప్రారంభించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ చేసిన కృషి ఫలించింది. ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన నాయుడు సమక్షంలో ఎంపీలు కేశినేని, జీఎం హరీష్ ఇండిగో ఫ్లైట్ స్పెషల్ డైరెక్టర్ ఏకే సింగ్‌తో సమావేశమై, ప్రస్తుత ఏటీఆర్ విమానాల వల్ల టికెట్ ధరలు, సీట్ల కొరత, లగేజీ సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఏకే సింగ్, వారం నుంచి పది రోజుల్లో విజయవాడహైదరాబాద్ మధ్య బోయింగ్ వైడ్‌బాడీ విమాన సర్వీసులను ప్రారంభిస్తామని, దీనివల్ల టికెట్ ధరలు తగ్గి, సీట్లు, లగేజీ సదుపాయం పెరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా, ఎంపీ శివనాథ్ కోరిన విధంగా విజయవాడ నుంచి వారణాసి, అహ్మదాబాద్, పుణె, కొచ్చిన్, గోవా లకు విమాన సేవలు నడిపేందుకు ప్రయత్నిస్తామని, ముఖ్యంగా వారణాసి, కొచ్చిన్ మార్గాలను త్వరగా ప్రారంభించాలని కేంద్రమంత్రి రామ్మోహన నాయుడు కోరినట్లు ఈ సమావేశంలో వెల్లడైంది.



### ప్రజలకు మెరుగైన
## సౌకర్యాలు కల్పిస్తాం

**చిత్తూరు (ఏడీఎన్ఎన్) :**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్తూరులో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. అదే కార్యక్రమంలో రాష్ట్రంలోని 77 డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన, ఈ కార్యాలయాలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థంగా చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చినట్లు, పంచాయతీరాజ్ వ్యవస్థను బలపరచడానికి ఐటీ వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు పవన్ తెలిపారు.



### నవతరం స్మార్ట్
## సేవింగ్ అలవాట్లివే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఒకప్పటి పాతకాలం మనీ సేవింగ్స్ పథకాలు, ఫిక్సిడ్ డిపాజిట్లు, ఆర్డీల వంటి వాటికి కాలం చెల్లిపోయింది. ఇప్పటి జెన్ జి తరం యువత సరికొత్త స్మార్ట్ సేవింగ్ అలవాట్లతో దూసుకుపోతున్నారు. వారికి తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం సాధించేలా చూసుకుంటున్నారు. వారు యూపీఐ యాప్‌లపై లభించే తక్షణ క్యాష్‌బ్యాక్, రివార్డ్ లను మరింత లాభదాయకంగా భావిస్తారు. ఎందుకంటే ఇది డబ్బును వెంటనే ఆదా చేస్తుంది. గత జనరేషన్ పద్ధతిలో క్రెడిట్ కార్డులపై ఆధారపడడం లేదు. ఖరీదైన బ్రాండెడ్, కొత్త వస్తువులను కొనుగోలు చేయడానికి బదులుగా తక్కువ ధరలో లభించే వస్తువుల కోసం థ్రిఫ్ట్ స్టోర్స్, ఇన్‌స్టాగ్రామ్ లేదా షాపింగ్ యాప్స్ వంటి ప్లాట్ ఫారమ్‌లను ఎంచుకుంటారు. ఓటీటీ, మ్యూజిక్ వంటి యాప్ల పూర్తి ఖర్చు ఒక్కరే భరించడానికి బదులుగా.. స్నేహితులతో కలిసి ప్లాన్లను పంచుకుంటారు. దీనివల్ల నెలకు అయ్యే భారం చాలా తగ్గుతుంది. సెలవుల్లో ఖరీదైన, రద్దీ సమయాల్లో తిరగడానికి బదులుగా ఆఫ్ సీజన్లో ప్రయాణిస్తారు. దీనివల్ల విమానాలు, హోటళ్లు చాలా చౌకగా లభిస్తాయి. వారు తమ ఉపయోగించిన వస్తువులు, బట్టలు, గాడ్జెట్లు, ఉపకరణాలను అమ్మడం ద్వారా మళ్లీ డబ్బు ఆదా చేస్తారు.




### ధనాధిపతి కుబేరుని
## అనుగ్రహం పొందాలంటే..?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హిందూ పురాణాల ప్రకారం శ్రీమహాలక్ష్మీ దేవి సంపదకు అధిపతి. కుబేరుడు సంపదను సంరక్షిస్తాడు. అందుకే కుబేరుని పటంతో కూడిన లక్ష్మీ పటాన్ని ఇంట్లో ఉంచి పూజించితే ఆ ఇంట ధనాధిపతి కుబేరుని అనుగ్రహం ఉంటుంది.

- వ్యాపారంలో లాభం పెరగాలంటే.. కుబేరునికి పాలాభిషేకం చేయించి... ఎరుపు రంగు పుష్పాలతో అర్చన చేయించాలి.
- తమిళనాడులోని తిరువణ్ణామలై ఆలయ గిరి ప్రదక్షణ సమయంలో కుబేర లింగాన్ని తప్పకుండా దర్శించుకుంటే ధనానికి లోటుండదు.
- గురువారం రోజున కుబేరుడిని పూజిస్తే సకలసంపదలను పొందవచ్చునని పండితులు చెప్తున్నారు.
- కుబేరుడు ఊరగాయ ప్రియుడు. అందుచేతనే ఇంట్లో శుభ్రమైన ఊరగాయ ఉంచడం ద్వారా కుబేరుని అనుగ్రహం పొందవచ్చును.
- ఇంటికొచ్చే సుమంగళీ మహిళలకు నీరు ఇవ్వాలి. ఆపై పసుపు, కుంకుమలు ఇవ్వడం చేయాలి. ఇలా చేస్తే జన్మజన్మల పాపం, దారిద్ర్యం తీరిపోయి.. ధనాభివృద్ధి చేకూరుతుంది.
- అలాగే అమావాస్య రోజున ఇంటి ముందు రంగవల్లికలు, ముగ్గులు ఉండకూడదు. తలంటుస్నానం చేయకూడదు. ఆ రోజున పితృదేవతలను పూజిస్తే.. సకలసంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక పండితులు అంటున్నారు.
- ఇంట్లో దేవుడికి పూజ చేసే విధానాలని పంచోపచారాలు అంటారు. అంటే ఐదు విధానాల ద్వారా దేవతానుగ్రహం పొందటం అన్నమాట.
- దేవుడి పటాలకి పసుపు, కుంకుమ, చందనం వంటివి పెట్టడం. పూవులతో అర్చన చేయడం. సాంబ్రాణి, అగరత్తులు వెలిగించడం. దీపారాధన చేయడం. నైవేద్యాన్ని ప్రసాదంగా సమర్పించడం. ఈ పంచోపచారాలతో భగవంతుని పూజ చేయడం ద్వారా దేవతానుగ్రహం పొందవచ్చు.



### రూ.20 లక్షలు లంచం
## డిమాండ్, టెకీ ఆత్మహత్య

**బెంగళూరు (ఏడీఎన్ఎన్) :**

బెంగళూరు ఐటీ ఉద్యోగి అకాల మరణం ఆందోళన కలిగించింది. నల్లురహళ్లిలో నిర్మాణంలో ఉన్న భవనంలో మాజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మురళి గోవిందరాజు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఒక స్థలం కొనుగోలు విషయంలో లంచాలకు ఆశపడిన అధికారుల వేధింపుల కారణంగానే అతను బలవన్మరణానికి పాల్పడ్డాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. మురళి గోవిందరాజుకు భార్య దుర్గాదేవి, పిల్లలు కనిష్క, దేశిత ఉన్నారు. 2018 లో నల్లురహళ్లిలో ఒక బంధువు నుండి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో ఇల్లు కట్టే పనిలో ఉన్నాడు. అక్టోబర్ 25న, ఉషా నంబియార్, శశి నంబియార్ అనే ఇద్దరు వ్యక్తులు మురళిని పలుమార్లు ఇంటికొచ్చి మరీ రూ.20 లక్షలకై డిమాండ్ చేశారు. దీనికి మృతుడు నిరాకరించడంతో వేధింపులు మరింత ఎక్కువ అయ్యాయి. వారు కొంతమంది గ్రేటర్ బెంగళూరు అథారిటీ అధికారులతో కుమ్మక్కయ్యారని, నిర్మాణ స్థలాన్నిపదే పదే సందర్శించి, తమ కుమారుడిని మానసికంగా వేధించి, బెదిరించారని కుటుంబం ఆరోపించింది. నిరంతర వేధింపులతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు దాఖలు చేసిన ఫిర్యాదులో తల్లి పేర్కొంది. సంఘటన జరిగిన రోజున తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్నాడన్నారు. తీవ్ర మనస్థాపానికి గురైన అతను ఉదయం 6 గంటలకు నిర్మాణంలో ఉన్న భవనానికి వెళ్లాడని తెలుస్తోంది. ఆ తర్వాత సీలింగ్ ఫ్యాన్ కోసం ఉంచిన ఇనుప రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికోసం వచ్చిన వడ్రంగి గణేష్ మృతదేహాన్ని చూసి పోల్చుకున్న వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఉష, శశిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మురళి తల్లి కోరింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.



# గిల్ వచ్చేసాడు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

టీ20ల్లో టీమ్ఇండియా వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్ గాయం నుంచి కోలుకుని మళ్లీ జట్టులోకి వచ్చాడు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య కూడా గాయం నుంచి పూర్తిగా కోలుకుని పునరాగమనం చేశాడు. ఈ ఇద్దరికీ దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఎంపికైన భారత జట్టులో స్థానం దక్కింది. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో గాయపడి వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయిన గిల్ ఇప్పుడు తిరిగి వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడని బీసీసీఐ ప్రకటించింది. అయితే గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మరోవైపు ముస్తాక్ అలీ ట్రోఫీ ద్వారా హార్దిక్ ఇప్పటికే తన ఫిట్‌నెస్‌ను ప్రూవ్ చేశాడు. 2025 ఆసియా కప్ ఫైనల్ నుంచి దూరమైన అతడు ఆస్ట్రేలియా పర్యటనకు కూడా అందుబాటులో లేకపోయాడు. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించిన ఈ జట్టు డిసెంబరు 9 నుంచి 19 వరకు జరుగనున్న దక్షిణాఫ్రికా టీ20 సిరీస్‌లో పోటీపడనుంది. ఈ సిరీస్‌కు కటక్, చండీగఢ్, ధర్మశాల, లఖ్‌నవూ, అహ్మదాబాద్ వేదికలుగా నిలుస్తాయి. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా ఉన్న ఈ జట్టులో గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజు శాంసన్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, కుల్‌దీప్, హర్షిత్, వాషింగ్టన్ సుందర్ వంటి ఆటగాళ్లు ఉన్నారు.




## భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్
# ఘన విజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

జెరూసలెంలో జరిగిన ప్రతిష్టాత్మక మాస్టర్స్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి ఘన విజయం సాధించాడు. ఫైనల్‌లో చెస్ ప్రపంచంలో లెజెండ్‌గా పేరుగాంచిన విశ్వనాథన్ ఆనంద్‌ను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకోవడం అతడి కెరీర్‌లో మరో గొప్ప మైలురాయిగా నిలిచింది. ఫైనల్ ఆరంభంలో జరిగిన రెండు ర్యాపిడ్ గేములు ఉత్కంఠభరితంగా సాగి డ్రాగా ముగియడంతో పోరు బ్లిట్జ్ రౌండ్లకు చేరింది. నిర్ణాయక దశలో అర్జున్ అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. మొదటి బ్లిట్జ్ గేమ్‌లో ఆనంద్‌పై విజయం సాధించి ఆధిపత్యాన్ని సాధించాడు. రెండో బ్లిట్జ్ గేమ్ కూడా కఠినంగా సాగి చివరికి డ్రాగా ముగియడంతో తుదికి మొత్తం పోరులో అర్జున్ ఇరిగేశి విజేతగా నిలిచాడు. ఈ టైటిల్‌తో అర్జున్ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను మరింత బలంగా చాటుకున్నాడు.



## ఎట్టకేలకు లాభాల్లోకి
# స్టాక్ మార్కెట్ సూచీలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

నాలుగు రోజుల వరుస నష్టాల నుండి గురువారం ఎట్టకేలకు లాభాల బాట పట్టాయి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు. ఐటీ స్టాక్స్ కొనుగోళ్లు జోరందుకోవడంతో సూచీలకు కలిసివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ల నుండి కూడా మద్దతు లభించింది. ఆర్బీఐ పరపతి విధాన సమీక్షలు శుక్రవారం వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా ఉన్నారు. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్ సీఎల్, భారతీ ఎయిర్ టెల్ షేర్లు లాభపడ్డాయి. మారుతీ సుజుకి, కోటక్ మహీంద్రా, టైటాన్, ఐసీఐసీఐ షేర్లు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 90 గా ఉంది. బంగారం ఔన్సు 4200 వద్ద ట్రేడవుతోంది.

## రియల్ మీ పీ4 ఎక్స్
# లాంచ్ ఆఫర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



దేశీయ మార్కెట్లో రియల్ మీ మరో బడ్జెట్ ఫోన్ ని లాంచ్ చేసింది. పీ సిరీస్ నుండి పీ4ఎక్స్ 5జీని విడుదల చేసింది. అయితే వినియోగదారులకు లాంచ్ ఆఫర్‌గా బేస్ వేరియంట్ పై రూ.2వేలు డిస్కౌంట్ ధరకే అందిస్తోంది. రూ.15,499 ఫోన్ రూ.13,499 కే లభిస్తోంది. ఈ ఫోన్ యూఐ 6.0 తో పని చేస్తుంది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 45 డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ వంటి సదుపాయాలతో ఈ స్మార్ట్ ఫోన్ వచ్చింది. ఇది మూడు వేరియంట్లలో లభిస్తోంది. 6 జీబీ ప్లస్ 128 జీబీ వేరియంట్ ధర రూ.15,499 గా ఉంది. 8 జీబీ ప్లస్ 128 ధర రూ.16,999, 8 జీబీ ప్లస్ 256 జీబీ వేరియంట్ ధర రూ.17999 గా ఉంది. మ్యాటీ సిల్వర్, ఎలిగెంట్ పింగ్, లేక్ గ్రీన్ రంగుల్లో లభ్యమవుతోంది. డిసెంబర్ 10 తేదీ నుండి ఫ్లిప్ కార్ట్ లో విక్రయాలు ప్రారంభమవుతున్నాయి.

## బౌలర్‌లే ముంచారు...
# షమీ కోసం అభిమానుల డిమాండ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్ భారీ పరాజయం ఎదుర్కొంది. 359 పరుగుల భారీ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ముందు ఉంచినప్పటికీ, భారత బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా హర్షిత్ రాణా, ప్రసిద్ కృష్ణ వంటి అనుభవం తక్కువ బౌలర్లపై ఆధారపడటం అభిమానులకు నచ్చలేదు. హర్షిత్ రాణా 70 పరుగులు, ప్రసిద్ కృష్ణ 85 పరుగులు ఇచ్చినా ఒక్కో వికెట్ కూడా తీసుకోలేకపోయారు. వీరిద్దరూ పేస్ బౌలింగ్‌ను సరిగ్గా నియంత్రించలేకపోవడంతో దక్షిణాఫ్రికా బ్యాటర్లు అగ్రసివ్‌గా ఆడి మ్యాచ్‌ను సులభంగా గెలిచారు. మొదటి వన్డేలోనూ భారత్ ఓటమి అంచు దాకా వెళ్లి చివరికి గెలిచింది. ఆ మ్యాచ్‌ను చూస్తేనే బౌలింగ్‌లో లోపాలు స్పష్టంగా కనిపించాయి. అయినప్పటికీ రెండో మ్యాచ్‌లో అదే తప్పిదం పునరావృతం కావడంతో అభిమానులు బీసీసీఐ ఎంపికలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహమ్మద్ షమీ పేరు ఒక్కసారిగా తిరిగి చర్చకు వచ్చాడు. 2023 వన్డే వరల్డ్ కప్‌లో కేవలం 7 మ్యాచ్‌ల్లో 24 వికెట్లు సాధించి టోర్నమెంట్‌లో అత్యంత ప్రభావవంతమైన బౌలర్లలో ఒకరిగా నిలిచిన షమీని జట్టులోకి తీసుకోకపోవడంపై అభిమానులు ఆగ్రహిస్తున్నారు. అలాగే ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా 5 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు తీసి మంచి ప్రదర్శన చేశాడు. ఇంత స్థాయి ఉన్న బౌలర్‌ను పక్కనబెట్టడం జట్టు ప్రయోజనాలను దెబ్బతీస్తుందని అభిమానులు సోషల్ మీడియాలో ఘాటుగా విమర్శిస్తున్నారు. మొహమ్మద్ సిరాజ్‌కి కూడా అవకాశం ఇవ్వాలని, అనుభవజ్ఞులైన బౌలర్లను విస్మరించడం వల్లే భారత్ వరుసగా సమస్యలు ఎదుర్కొంటోందని అభిమానులు అంటున్నారు. యువ బౌలర్లకు అవకాశం ఇవ్వడం తప్పు కాదుగానీ, పెద్ద మ్యాచ్‌ల్లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లను విస్మరించడం భారత జట్టుకు ప్రమాదకరమని అభిప్రాయపడుతున్నారు.

# దిగ్గజాలపై నీలినీడలు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత క్రికెట్‌లో తరతరాలు గుర్తుంచుకునే పేరు ప్రఖ్యాతులు సంపాదించిన దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ . ఈ ఇద్దరూ ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్ పైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. 2027 ప్రపంచ కప్లో భారత్‌కు మరోసారి కప్ అందించడం వారు లక్ష్యంగా పెట్టుకున్నారు .అయితే, వారి ఆశలకు, అంచనాలకు భిన్నంగా టీమ్ఇండియా శిబిరం నుంచి స్పష్టమైన సంకేతాలు రావడం లేదు . ఈ యోధులు 2027 వరకూ జట్టులో ఉంటారని టీమ్ మేనేజ్‌మెంట్ కానీ, సెలక్షన్ కమిటీ కానీ హామీ ఇవ్వకపోవడం ఇప్పుడు పెను దుమారానికి దారితీసింది. కావాలనే ఈ స్టార్ ఆటగాళ్లను అణగదొక్కేందుకు, వారి భవిష్యత్తుపై గందరగోళ పరిస్థితులను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు భారత క్రికెట్ యాజమాన్యంపై తీవ్రస్థాయిలో వస్తున్నాయి. ఈ సున్నితమైన అంశంపై భారత జట్టు మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి ఒక ఇంటర్వ్యూలో గట్టిగా స్పందించారు. తన శిష్యులుగా, తన కళ్లముందే ఎదిగిన ఈ ఇద్దరు స్టార్ల పట్ల జరుగుతున్న వ్యవహారంపై ఆయన కొంత ఆగ్రహం వ్యక్తం చేశారు.కొంతమంది కావాలనే రోహిత్, కోహ్లీ భవిష్యత్తు గురించి అసంబద్ధమైన, గందరగోళ చర్చలను సృష్టిస్తున్నారని రవి శాస్త్రి పరోక్షంగా బోర్డు పెద్దలు, సెలెక్టర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.రోహిత్, కోహ్లీలు వన్డే క్రికెట్‌లో దిగ్గజాలని , ఆ స్థాయి ఆటగాళ్లతో అనవసరంగా గొడవపడకండని ఆయన చెప్పారు రవిశాస్త్రిని విలేకరి "రోహిత్, విరాట్ విషయంలో ఈ గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నది ఎవరు?" అని సూటిగా ప్రశ్నించగా, ఆయన తనదైన శైలిలో గుంభనంగా సమాధానం ఇచ్చారు: చేసేవారు చేస్తున్నారు. అంతే చెప్పగలను. ఒక్కసారి కోహ్లీ, రోహిత్ ఫామ్ అందుకుంటే , ఈ వ్యవహారం మొత్తానికి ఫుల్‌స్టాప్ పడుతుందని చెప్పారు క్రికెట్ విశ్లేషకులు శాస్త్రి వ్యాఖ్యలను గమనించి, ఆయన పరోక్షంగా సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ , టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే మాట్లాడారని అభిప్రాయపడుతున్నారు . ఈ ఇద్దరు దిగ్గజాలు ప్రస్తుతం వారి ఫామ్‌తోనే విమర్శలకు సమాధానం చెబుతున్నారు. సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతను వరుసగా రెండు శతకాలు సాధించి, తాను ఎప్పటికీ జట్టుకు అత్యంత కీలక ఆటగాడినని నిరూపించుకున్నాడు.అటు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తనదైన దూకుడు ఆటతో అర్ధ శతకం సాధించి, వన్డే ఫార్మాట్‌లో తన విలువను, అనుభవాన్ని మరోసారి చాటిచెప్పాడు.రోహిత్, కోహ్లీ తమ బ్యాట్‌తో సమాధానం చెబుతున్న ఈ తరుణంలో, వారి భవిష్యత్తు గురించి గందరగోళం సృష్టించడం అర్థరహితమని, 2027 ప్రపంచ కప్ వరకు ఈ ఇద్దరు దిగ్గజాలు భారత జట్టులో కొనసాగడం దాదాపు ఖాయమని అభిమానులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఎల్ఐసీ నుంచి రెండు కొత్త పాలసీలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ పాలసీదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రెండు కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్లను మార్కెట్లోకి తీసుకొచ్చింది. 'ఎల్ఐసీ ప్రొటెక్షన్ ప్లస్' (ప్లాన్ 886) , 'ఎల్ఐసీ బీమా కవచ్' (ప్లాన్ 887) పేరిట విడుదల చేసిన ఈ ప్లాన్లు సేవింగ్స్ తో పాటు రిస్క్ ప్రొటెక్షన్‌ను కూడా అందించే విధంగా రూపొందించబడ్డాయి. ప్రొటెక్షన్ ప్లస్ అనేది నాన్‌పార్టిసిపేటింగ్, లింక్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కావడంతో మార్కెట్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇందులో పాలసీదారుడు బీమాతో పాటు సేవింగ్స్ ప్రయోజనాలను కూడా పొందవచ్చు. పాలసీ టర్మ్ మొత్తం బీమా రక్షణ లభించడమే కాకుండా, బాండ్ ఫండ్, సెక్యూర్డ్ ఫండ్, బ్యాలెన్స్ డ్ ఫండ్, గ్రోత్ ఫండ్, ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్, ఫ్లెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్ వంటి ఫండ్ ఆప్షన్లలో ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంటుంది. పాలసీ ప్రారంభమైన ఐదేళ్ల తర్వాత పాక్షిక ఉపసంహరణలకు అనుమతి కల్పించారు. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు గలవారు ఈ పాలసీ తీసుకోవచ్చు. 10, 15, 20, 25 ఏళ్ల పాలసీ టర్మ్ తో పాటు 5, 7, 10, 15 సంవత్సరాల ప్రీమియం చెల్లింపు వ్యవధి ఎంచుకునే అవకాశం ఉంటుంది. 35 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల పాలసీ టర్మ్‌తో, 15 సంవత్సరాల చెల్లింపు వ్యవధితో ఏడాదికి రూ.40,000 చెల్లిస్తే అతని బేసిక్ సమ్ అష్యూర్డ్ 10 రెట్లు ఉంటుంది. రాబడుల ఆధారంగా మెచ్యూరిటీ విలువ మారుతుంది. ఇక ఎల్ఐసీ బీమా కవచ్ (ప్లాన్ 887) పూర్తిగా ప్యూర్ రిస్క్ ప్రొటెక్షన్ ప్లాన్. ఇది నాన్‌పార్టిసిపేటింగ్, నాన్‌లింక్డ్, ఇండివిడ్యువల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీగా కుటుంబానికి ఆర్థిక భద్రతను అందించే లక్ష్యంతో రూపొందించబడింది. కనిష్ఠంగా రూ.2 కోట్ల సమ్ అష్యూర్డ్ తో ప్రారంభమయ్యే ఈ పాలసీలో, తర్వాత రూ.5 లక్షల చొప్పున కవరును పెంచుకునే వెసులుబాటుంది. 18 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వారు ఈ పాలసీ తీసుకోవచ్చు. మెచ్యూరిటీ వయస్సు 28 నుండి 100 సంవత్సరాల మధ్య ఉంటుంది. ప్రీమియం చెల్లింపులో సింగిల్ పేమెంట్, 5/10/15 ఏళ్ల చెల్లింపు వ్యవధి లేదా రెగ్యులర్ పేమెంట్ వంటి ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు, 30 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల టర్మ్ తో రూ.2 కోట్ల సమ్ అష్యూర్డ్ కోసం లెవల్ సమ్ అష్యూర్డ్ ఆప్షన్ ఎంచుకుంటే, రెగ్యులర్‌గా ఏటా సుమారు రూ.19,000 చెల్లించాల్సి ఉంటుంది. చెల్లింపు వ్యవధిని తగ్గిస్తే ప్రీమియం మొత్తము పెరుగుతుంది. ఈ రెండు ప్లాన్లకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు షరతులు తెలుసుకునేందుకు ఎల్ఐసీ అధికారిక పాలసీ బ్రోచర్‌ను పరిశీలించాలని సూచించారు.

# జోహోలో ఉద్యోగాలకు డిగ్రీలు అవసరం లేదు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రఖ్యాత దేశీ యాప్ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు నేటి కాలేజీ చదువులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తమ కంపెనీ జోహోలో ఏ ఉద్యోగానికి కాలేజీ డిగ్రీలు అవసరం లేదని ప్రకటించారు. పెద్ద కంపెనీలలో ఉద్యోగాల కోసం విద్యార్థులను ఏటా జేఈఈ వంటి ప్రవేశ పరీక్షల కోసం టీచర్లు, తల్లిదండ్రులు బాగా ఒత్తిడి చేస్తుంటారని, అయితే నిజానికి అసలు ఉద్యోగాలకు ఎలాంటి డిగ్రీలు అవసరం లేదన్నారు. సాంప్రదాయ విద్యావిధానంలో ఒత్తిడి తగ్గించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ అమెరికన్ విద్యార్థులు కాలేజీలకు వెళ్లడం మానేస్తున్నారని, ముందుచూపుండే కంపెనీల యజమానులు వారికి అవకాశం ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల చదువుల కోసం భారీ అప్పులు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. తమ కంపెనీలో ఉద్యోగానికి కేవలం వారి నైపుణ్యాలను వివరిస్తే సరిపోతుందన్నారు. తమిళనాడులోని తమ కంపెనీలో కేవలం 19 ఏళ్ల వయసున్న బృందంతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. వారు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

## అదరగొట్టిన బంగారం బాండ్లు..
# లక్షకు నాలుగున్నర లక్షలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



బంగారం బాండ్లు కొనుగోలు దారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. 2017 డిసెంబర్ 4 న జారీ చేసిన తుది రిడెంప్షన్ ధరను ఆర్బీఐ గురువారం ప్రకటించింది. అప్పుడు జారీ చేసిన బాండ్లు అదరగొట్టే ప్రతిఫలాలు అందిస్తున్నాయి. లక్ష రూపాయలు మదుపు చేసిన వారికి ఏకంగా నాలుగున్నర లక్షలు రావడంతో ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు. అప్పట్లో గ్రాము బంగారం ధర రూ.2,961 కాగా, ఇప్పుడు 8 ఏళ్లు పూర్తి కావడంతో మెచ్యూరిటీకి వచ్చాయి. ఇప్పుడు ఈ ధర రూ. 12,820 గా నిర్ణయించింది. అంటే ఒక గ్రాముపై ఏకంగా రూ.9901 ప్రతిఫలం వచ్చింది. దీనికి ఏటా చెల్లించే వడ్డీ 2.5 శాతం అదనం కావడంతో ఈ మొత్తం ఇంకా పెరిగుతుంది. దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించే ఉద్దేశంతో 2015 నవంబర్ లో కేంద్రం తీసుకువచ్చిన ఈ పథకం కాలపరిమితి 8 ఏళ్లు. ప్రభుత్వం తరఫున ఆర్బీఐ జారీ చేసే ఈ బాండ్లు ఖజానాకు భారం కావడంతో గతేడాది ఈ బాండ్ల జారీని నిలిపివేశారు. అయితే ఈ బాండ్లు కొనుగోలు చేసినవారికి బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో చాలా లాభాలు వస్తున్నాయి.



## షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్స్ లో
# హైదరాబాద్ అమ్మాయి

- ✦ భారత్ ఆశలను మోస్తున్న ఇషా సింగ్
- ✦ పోటీలో ఇండియా నుంచి 14 మంది దిగ్గజ షూటర్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచకప్ ఫైనల్స్ వేదికగా ఖతార్ రాజధాని దోహాలో తుది సమరం మొదలైంది. ప్రతిష్ఠాత్మక ఈ టోర్నీలో భారత్ పతకాల వేటను ఘనంగా ముగించాలని చూస్తోంది. మరీ ముఖ్యంగా, ఈ మెగా ఈవెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి, యువ సంచలనం ఇషా సింగ్ బరిలో దిగనుండటం తెలుగు రాష్ట్రాల అభిమానులకు ఉత్సాహాన్నిస్తోంది.గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న ఇషా, తన సీజన్‌ను అత్యుత్తమ ప్రదర్శనతో ముగించాలని పట్టుదలతో ఉంది. ఇషా సింగ్ రెండు విభాగాల్లో (10 మీ ఎయిర్ పిస్టల్, 25 మీ పిస్టల్) తన ప్రతిభను చాటుకోనుంది.ఈ ప్రపంచకప్ ఫైనల్స్ లో భారత్ నుంచి మొత్తం 14 మంది అత్యుత్తమ షూటర్లు బరిలో ఉన్నారు. పురుషుల విభాగంలో... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సామ్రాట్ రాణా , వరుణ్ తోమర్ పోటీపడుతుండగా, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో యువ సంచలనాలు రుద్రాంక్ష్ పాటిల్ , అర్జున్ బబుతా తమ గురిని పరీక్షించుకోనున్నారు. ఇక, 25 మీ ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అనీష్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ పతకం కోసం పోరాడనున్నారు. 50 మీ రైఫిల్ 3 పొజిషన్‌లో ఐశ్వరి ప్రతాప్‌సింగ్ తోమర్, అలాగే ట్రాప్ ఈవెంట్‌లో జొరావర్ సంధూ భారత్ ఆశలను మోయనున్నారు. మహిళల విభాగంలో... 10 మీ ఎయిర్ పిస్టల్‌లో సురుచి సింగ్, ఒలింపిక్స్ కాంస్య పతక విజేత మను బాకర్, హైదరాబాద్ స్టార్ ఇషా సింగ్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 10 మీ ఎయిర్ రైఫిల్‌లో ఇలవెనిల్ వలెరివన్ పోటీపడుతుండగా, 25 మీ పిస్టల్‌లో తిరిగి మను బాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్, ఇషా సింగ్ తలపడనున్నారు. చివరగా, 50 మీ రైఫిల్ 3 పొజిషన్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా పాల్గొంటున్నారు.



## జో రూట్ శతకం...
# స్టార్క్ ఆరు వికెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య గబ్బా వేదికగా గురువారం ప్రారంభమైన రెండో డే/నైట్ టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఇంగ్లాండ్‌కు ఊతమిస్తూ సారథి జో రూట్ అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తూ 135 పరుగులతో (202 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకం సాధించాడు. ఓపెనర్ జాక్ క్రాలీ (76; 93 బంతుల్లో 11 ఫోర్లు) దూకుడుగా ఆడగా, చివర్లో జోఫ్రా ఆర్చర్ (32; 26 బంతుల్లో) రూట్‌కు సహకారం అందించాడు. ఇతర బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ (31), బెన్ స్టోక్స్ (19), విల్ జాక్స్ (19) పరుగులు చేశారు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ అద్భుతంగా బౌలింగ్ చేసి 6/71తో ఇంగ్లాండ్‌ను దెబ్బ తీశాడు. కాగా, ఆస్ట్రేలియా గడ్డపై రూట్‌కు ఇది తొలి సెంచరీ కావడంతో, ఈ సిరీస్‌కు ముందు రూట్ సెంచరీ చేయకపోతే తాను మెల్‌బోర్న్‌లో 'నగ్నంగా నడుస్తా' అని సవాలు విసిరిన ఆసీస్ మాజీ బ్యాటర్ మ్యాథ్యూ హేడెన్ ఇప్పుడు ఊపిరి పీల్చుకున్నాడు, శతకం చేసిన రూట్‌ను అభినందించాడు.



## టోల్ ప్లాజా వద్ద ఆగకుండా
# సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

జాతీయ రహదారులపై వెళ్తున్నప్పుడు టోల్ ప్లాజాల వద్ద కాసేపు ఆగడం మామూలే. గతంలో డబ్బు కట్టే పద్ధతికి స్వస్తి చెప్పి, ప్రస్తుతం ఫాస్టాగ్ ను అమలు చేస్తున్నారు. దీనితో కొంత మేరకు టైం కలిసివచ్చినా, ఇకపై ఒక్క నిమిషం కూడా ఆగనక్కరలేకుండా పూర్తిగా సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు కేంద్ర రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీ. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వ్యవస్థను ఇప్పటికే 10 ప్రాంతాల్లో అమలు చేస్తున్నామని, ఒక సంవత్సరం లోపు దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన అన్నారు. ప్రస్తుత విధానానికి స్వస్తి పలికి, ఏడాదిలో దేశవ్యాప్తంగా కొత్త విధానం అమల్లోకి రానుందని ఆయన స్పష్టం చేశారు. "ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత టోల్‌ప్లాజాల వద్ద ఎవరూ మిమ్మల్ని ఆపరు. దేశవ్యాప్తంగా దీనిని త్వరలో అమలు చేస్తాం" అని గడ్కరీ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రూ.10 లక్షల కోట్ల విలువైన 4,500 హైవే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. టోల్‌ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఎన్హెచ్ఏఐ తీసుకువచ్చింది. ఇది ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. టోల్ ప్లాజా మీదుగా వాహనం వెళ్లినప్పుడు ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంకు ఖాతా నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.




## 'అవతార్' ప్రీమియర్ లో అర్నాల్డ్ ష్వార్జెనెగర్

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

లాస్ ఏంజిల్స్ లో జరిగిన 'అవతార్ ఫైర్ అండ్ ఆష్ ప్రీమియర్'కు టెర్మినేటర్ నటుడు అర్నాల్డ్ ష్వార్జెనెగర్ తన మిత్రుడు జేమ్స్ కామెరూన్‌కు మద్దతుగా హాజరయ్యారు. ఇద్దరూ టెర్మినేటర్ ఫ్రాంచైజీలో కలిసి పనిచేసిన దశాబ్దాల చరిత్రను పంచుకుంటున్నారు. ఇది యాక్షన్ సినిమాలో వారిని లెజెండ్స్ గా నిలిపింది. ప్రీమియర్ వేడుక భారీ ఉత్సాహంతో నిండిపోయింది. ఈ ఏడాది అత్యంత ఆసక్తికరమైన రిలీజ్‌లలో ఒకటిగా నిలిచిన ఈ చిత్రంకు అభిమానులు, ఇండస్ట్రీ ఇన్‌సైడర్లు, మీడియాతో హోరెత్తించింది. కామెరూన్ సైఫై యూనివర్స్ ను మరింత విస్తరించిన ఈ మూవీలో అద్భుతమైన విజువల్స్, ఎక్స్‌పాండెడ్ వరల్డ్ బిల్డింగ్ ఉన్నాయి. ష్వార్జెనెగర్ రాకతో వేడుక మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అద్భుతమైన ముందస్తు స్పందనలు అందుకుంది. విమర్శకులు దాని అద్భుత విజువల్స్, కొత్త పాత్రలు, స్కేల్, హార్ట్, సినిమాటిక్ ఆంబిషన్‌లను ప్రశంసించారు. అవతార్: ఫైర్ అండ్ ఆష్ డిసెంబర్ 19న భారత్‌లో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదలవుతుంది.



# ఆయన గ్రేస్ వేరు!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు పండుగ ముందే పండుగ వాతావరణం నెలకొంది. లేడీ సూపర్ స్టార్ నయనతార జంటగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' నుండి విడుదలైన తాజా పోస్టర్ సోషల్ మీడియాలో దూసుకుపోతోంది. పోస్టర్‌లో చిరంజీవి మాస్ లుక్, నయనతారతో ఉన్న ఆయన కెమిస్ట్రీ, అభిమానుల్లో భారీ అంచనాలు రేపాయి. ఈ సినిమా ఫ్యామిలీతో పాటు మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా 2026 సంక్రాంతికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నామని మేకర్స్ ప్రకటించడం, మెగా ఫ్యాన్స్‌ను ఓవర్ ఎక్సైట్ చేసింది. ఈ పోస్టర్ విడుదలతోనే సినిమా హైప్ గరిష్ఠస్థాయికి చేరింది. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్, అనిల్ రావిపూడి స్టైల్ ఎంటర్‌టైన్‌మెంట్ , నయనతార గ్లామర్ కలిసి భారీ హిట్ ఖాయం అనిపిస్తోంది. మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సంక్రాంతి నిజంగా మెగా సంబరాలే కానున్నాయని ఇప్పుడే అందరూ అంటున్నారు.

**వెంకటేష్ షూటింగ్ పార్ట్ పూర్తి**

మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఫ్యాన్స్ కి బిగ్గెస్ట్ ట్రీట్ కానుంది. తాజాగా విక్టరీ వెంకటేష్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయిందని తెలియజేస్తూ.. సోషల్ మీడియాలో స్పెషల్ పోస్టు పెట్టారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా కోసం నా భాగం పూర్తయ్యింది. ఇది ఎంతో అద్భుతమైన అనుభవం! నాకు ఎంతో ఇష్టమైన మెగాస్టార్ చిరంజీవి తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఎంతో కాలంగా ఎదురుచూశాను. ఆ అవకాశాన్ని ఈ ప్రత్యేకమైన సినిమాతో ఇచ్చినందుకు డైరెక్టర్ అనిల్ రావిపూడికి హృదయపూర్వక ధన్యవాదాలు. మనం అందరం కలిసి 2026 సంక్రాంతిని థియేటర్స్ లో ఘనంగా సెలబ్రేట్ చేద్దాం. విక్టరీ వెంకటేష్ పోస్ట్ కి మెగాస్టార్ చిరంజీవి రిప్లయ్ ఇస్తూ ఒక ప్రత్యేకమైన పోస్ట్ పెట్టారు. మై డియర్ వెంకీ... మై బ్రదర్.. మనిద్దరం కలిసి పనిచేసిన ఈ పది రోజులు నాకు మెమరబుల్. నీతో గడిపిన ప్రతి క్షణం ఆనందంతో, ఎనర్జీతో నిండిపోయింది. 'మన శంకరవర ప్రసాద్ గారు' చిత్రానికి నువ్వు ఇచ్చిన ప్రత్యేకమైన ప్రజెన్స్ అబ్బురపరిచింది. నీతో గడిపిన ప్రతి క్షణం ఎంతో ఆనందం కలిగించింది. విక్టరీ వెంకటేష్, మెగాస్టార్ చిరంజీవి పోస్టులుని కోట్ చేస్తూ తన ఆనందాన్ని తెలియజేస్తూ డైరెక్టర్ అనిల్ రావిపూడి పోస్ట్ పెట్టారు. కొన్ని కలలు మన మనసులో సంవత్సరాల పాటు దాగి ఉంటాయి. అకస్మాత్తుగా సినిమా అలాంటి కలలను నిజం చేస్తుంది. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ తో పక్కపక్కన నిలబడి, కలిసి నవ్వుతూ, డ్యాన్స్ చేస్తూ, వారి ప్రత్యేకమైన చార్మ్ తో మెరిసిన ఆ క్షణం... నిజంగా మాటల్లో చెప్పలేనంత ఆనందం ఇచ్చింది. నా ప్రయాణంలో ఇది ఒక గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. 'మన శంకరవర ప్రసాద్ గారు' కోసం తన పార్ట్ ని పూర్తిచేసి, ఈ అందమైన కలను సాకారం చేసిన డియర్ వెంకీ సర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. చార్ట్ బస్టర్ ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ ని సంపాదించి ఇప్పటికే ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా, తమ్మిరాజు ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు.2026 సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా ప్రేక్షకులు ముందుకు రానుంది.



## నందమూరి వారసుడి ఎంట్రీ ఎప్పుడు?

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

నందమూరి అభిమానులు ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం ఒకటుంది. అదేంటని ఆలోచిస్తున్నారా.. అదే.. నందమూరి వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ ఎప్పుడాని.. ఇదివరకే ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఒక సినిమాని అధికారికంగా ప్రకటించినా, కొన్ని కారణాలతో ఆ సినిమా కార్యరూపం దాల్చలేదు. తాజాగా మోక్షజ్ఞ పరిచయం కానున్న సినిమాపై ఆయన తండ్రి నందమూరి బాలకృష్ణ స్పష్టతనిచ్చారు. తన 'ఆదిత్య 369'కి కొనసాగింపుగా రూపొందనున్న 'ఆదిత్య 999 మ్యాక్స్'తోనే మోక్షజ్ఞ కథానాయకుడిగా పరిచయం కానున్నట్టు తెలిపారు. ఇటీవల గోవాలో జరిగిన 'ఇఫీ' వేడుకల్లో బాలకృష్ణ ఈ విషయాన్ని చెప్పారు. 'ఆదిత్య 999 మ్యాక్స్' సినిమాని ప్రముఖ దర్శకుడు క్రిష్ తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనుల్లోనే ఆయన తలమునకలై ఉన్నట్టు తెలిసింది.



## ఓ..! సుకుమారి' టైటిల్ పోస్టర్

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

యంగ్ హీరో తిరువీర్, టాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ తమ చిత్రాలు 'ప్రీ వెడ్డింగ్ షో', 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి ఓ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం టైటిల్ 'ఓ..! సుకుమారి'ని రివీల్ చేశారు. ఆకట్టుకునే పోస్టర్‌ను మేకర్స్ ఆవిష్కరించారు. ఇందులో నీలిరంగు హృదయ చిహ్నాన్ని ఒక అద్భుతమైన నారింజ రంగు మెరుపుతో డివైడ్ చేశారు. గ్రామ ప్రజలు పరిగెడుతూ కనిపంచడం కథలోని ఊహించని మలుపులను సూచిస్తుంది. టాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది. రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, ఈ చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు.



## దేవుని దయ లేకుండా 'అఖండ 2' చేయలేం

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్, ట్రైలర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'అఖండ 2: తాండవం' 2డి , 3డి రెండు ఫార్మాట్లలో 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ చెన్నై లో ప్రెస్ మీట్ నిర్వహించారు. నందమూరి మాట్లాడుతూ.. నేను ఇక్కడ పుట్టడం వల్ల చెన్నై నా ఇల్లులా అనిపిస్తుంది. మద్రాస్ నా జన్మభూమి, తెలంగాణ నా కర్మభూమి, ఆంధ్ర నా ఆత్మభూమి. ఈ చిత్రాన్ని వివిధ దేశాలలో 130 రోజుల్లోనే అద్భుతంగా చిత్రీకరించాం. దేవుని దయ లేకుండా ఇది సాధ్యం కాదు. ధర్మం కోసం జీవించాలి సత్యం కోసం పోరాడాలి, అన్యాయం ముందు తలవంచకూడదు అని మన సనాతన హైందవ ధర్మం చెప్పింది. ఈ సినిమాలో సనాతన ధర్మం పరాక్రమం చూస్తారు. భవిష్యత్ తరాలు ఈ సినిమా ద్వారా సనాతన ధర్మం గురించి నేర్చుకుంటారు. ఇది ప్రేక్షకులకు శాంతిని తెస్తుంది. ఈ సినిమా ఒక ఎన్‌సైక్లోపీడియా. మా నాన్న గారు నా గురువు, దైవం ఆయన పురాణాలు, సామాజిక, ఫాంటసీ వంటి విభిన్నమైన చిత్రాలను చేశారు. నేను ఆయన బాటలోనే నడుస్తున్నాను. కరోనాలో అందరూ భయపడుతున్న సమయంలో మొట్టమొదటి భారతీయ చిత్రంగా ఆ సమయంలో అఖండ చిత్రం విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఆ తర్వాత మిగతా సినిమాలన్నీ రిలీజ్ అయ్యాయి. బోయపాటి, మాది హిట్ కాంబినేషన్. సింహ లెజెండ్ అఖండ సినిమాలన్నీ విజయవంతమయ్యాయి. ఈ సినిమా కూడా ఘన విజయాన్ని సాధిస్తుంది. ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తవడం, ఇప్పటికీ హీరోగా కొనసాగుతుండటం నా తల్లితండ్రులు, అభిమానులు ఆశీస్సులని భావిస్తున్నాను.

## శరవణన్ ఇక లేరు..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**



కోలీవుడ్ నిర్మాత, ఏవీఎం ప్రొడక్షన్స్ అధినేత ఎం.శరవణన్ (86) కన్ను మూశారు. వయోభారంతో పాటు పలు ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ఆయన గురువారం ఉదయం 3.30 గంటలకు చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఏవీఎం బ్యానర్‌పై తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో 300 లకు పైగా సినిమాలను నిర్మించారు. తెలుగులో 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'జెమినీ', 'శివాజీ' సినిమాలను నిర్మించారు. శరవణన్ మృతితో చిత్ర పరిశ్రమ శోకసంద్రంతో నిండిపోయింది. బుధవారం పుట్టినరోజు నిర్వహించుకున్న ఆయన మరణం భారతీయ చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని, సినీ ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. శరవణన్ భౌతికకాయాన్ని గురువారం మధ్యాహ్నం 3.30 గంటల వరకే అభిమానుల సందర్శనార్థం ఏవీఎం స్టూడియో మూడో ఫ్లోర్ ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.



## మోనాలిసా 'లైఫ్'లో ఏం జరుగుతోంది!

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

కుంభమేళా ఫేమ్ మోనాలిసా కథానాయికగా నటిస్తున్న చిత్రం లైఫ్. సాయిచరణ్ హీరోగా వెంగమాంబ క్రియేషనర్స్ బేనర్ పై రూపొందుతున్న ఈ సినిమాకి శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అంజన్న నిర్మిస్తున్నారు . ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభించనున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సయాజీ షిండే, సీనియర్ నటుడు సురేష్, ఆమని, తులసి, రచ్చ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. మురళీ మోహన్ రెడ్డి డీవోపీగా పని చేస్తున్నారు. సుకుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు. బేబీ సురేష్ ఆర్ట్ డైరెక్టర్.

**గాడ్ ఆఫ్ మాస్ నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ మీద ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ చిత్రం 5న విడుదలవుతోంది. ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అభిమానుల్లో, ఆడియెన్స్ లో అంచనాల్ని పెంచేశాయి. 'అఖండ 2' గురించి విలక్షణ నటుడు ఆది పినిశెట్టి చెప్పిన సినిమా సంగతులేమిటో చూద్దాం..**



## నా క్యారెక్టర్ ఓ ప్రయోగం లాంటిదే..

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

**బోయపాటి శ్రీనుతో రెండో సారి పని చేస్తున్నారు కదా? ఏం తేడా గమనించారు?**

బోయపాటి గారి దర్శకత్వంలో నేను 'సరైనోడు'లో వైరం ధనుష్ అనే పాత్రను పోషించాను. అందులోని పాత్రకి 'అఖండ 2'లో నేను పోషించిన క్యారెక్టర్‌కు చాలా తేడా ఉంటుంది. ఇలాంటి పాత్రను పోషించడం నాకు కూడా కొత్తే. ఆడియెన్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందా? అని నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

**'అఖండ 2' కథను దర్శకుడు బోయపాటి మీకు ఎప్పుడు చెప్పారు?**

మంత్రతంత్రాల చుట్టూ తిరిగే పాత్రలు నేను చేయలేదు. నేను కథ వినకుండా ఓకే చేసిన మొదటి చిత్రం 'అఖండ 2'. బోయపాటి మీద నాకు చాలా నమ్మకం ఉంది. ఆయన సత్తా ఏంటో నాకు తెలుసు. బాలయ్య కి ఎదురుగా అంటే సరిపోతానా? అని అడిగాను. పర్‌ఫెక్ట్‌గా ఉంటారు అని ఆయన అన్నారు. సెట్‌కి వెళ్లిన తరువాతే నాకు ఆ వాతావరణం, కథ తెలిసింది. బోయపాటి నా పాత్రను వివరించిన తరువాత చాలా కన్ఫ్యూజ్ అయ్యాను. వైరం ధనుష్ లాంటి పాత్రలు అయితే సొంతంగా ఊహించుకుని చేసుకోవచ్చు. కానీ ఇందులో పోషించిన పాత్ర మాత్రం నాకు ఓ ప్రయోగం లాంటిదే. ఇందులోని ప్రతీ పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఆడియెన్స్ ఎలా రెస్పాన్స్ ఇస్తారో చూడాలి. బోయపాటి నాకు ముందే కొన్ని రిఫరెన్స్ లు ఇచ్చారు. ఇలానే ఉండాలి.. ఇలానే కనిపించాలి.. ఇలానే ప్రవర్తించాలి అని ఆయన ముందే చెప్పారు. చాలా లుక్ టెస్ట్‌ల తరువాత ఫైనల్‌గా ఇప్పుడు సినిమాలో మీరు చూస్తున్న లుక్ ఫైనల్ అయింది.

**బాలయ్యతో వర్క్ ఎక్స్ పీరియెన్స్ గురించి చెప్పండి?**

బాలయ్య గురించి బయట చాలా వింటుంటాం. కానీ సెట్‌లో ఆయన ఎనర్జీ వేరేలా ఉంటుంది. ఆయన ఉంటే సెట్‌లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. ఆయన ఎనర్జీని మ్యాచ్ చేయడం చాలా కష్టం. ఆయనకు ప్రతి నాయకుడిగా నేను సరిపోతానా? అని అడిగాను. కానీ నన్ను బోయపాటి నమ్మారు.

**'అఖండ 2'లో ఎలాంటి అంశాలు ఎక్కువగా ఉంటాయి?**

'అఖండ' కంటే 'అఖండ తాండవం'లో హై మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, థమన్ మ్యూజిక్, ఎలివేషన్స్ ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది. వాహ్ అనిపించేలా, ఆశ్చర్యపోయేలా ఎన్నో అంశాల్ని చూపించబోతున్నారు. అదే 'అఖండ 2' ప్లస్ పాయింట్. ఈ సినిమాలో భారీ యాక్షన్ సీక్వెన్స్ లు ఉంటాయి. మరీ ముఖ్యంగా రెండు మేజర్ సీక్వెన్స్ లు ఉంటాయి. ఓ సీక్వెన్స్ ను ఎండాకాలంలో 15 రోజుల పాటు నిర్విరామంగా షూటింగ్ చేశాం. మధ్యాహ్నం వరకు చాలా మంది ఎండదెబ్బకు పడిపోయారు. కానీ బాలయ్య మాత్రం ఆ ఎండలోనే అలా నిల్చుండేవారు. కనీసం గొడుగు కూడా పట్టుకుని ఉండేవారు కాదు. సినిమా పట్ల ఆయనకు ఉండే ప్రేమ, పిచ్చి నాకు అప్పుడు అర్థమైంది.

**సంగీతం, ప్రొడక్షన్ వాల్యూస్.. నేపథ్య సంగీతం గురించి చెప్పండి?**

థమన్ మామూలుగా కొడితేనే బాక్సులు బద్దలు అవుతుంటాయి. ఇక బాలయ్య థమన్ ఏ రేంజ్‌లో కొడతారో చెప్పాల్సిన పని లేదు. నా సీన్లకు కూడా ఈ సారి మ్యూజిక్ అదిరిపోతుంది. థమన్ తన ఆర్ఆర్‌తో అదరగొట్టబోతున్నారు. నేను కూడా స్క్రీన్ మీద ఆ మ్యూజిక్‌ను చూడాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. ఎన్నో డిఫరెంట్ లొకేషన్స్ లో ఇంత భారీ బడ్జెట్‌తో సినిమాను నిర్మించడం మామూలు విషయం కాదు. 14 రీల్స్ మాత్రం ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఈ మూవీని గొప్పగా నిర్మించింది. ఎవ్వరికీ ఎప్పుడు కూడా పేమెంట్స్ విషయంలో ఆలస్యం చేయలేదు. ఇలాంటి ప్రొడక్షన్ కంపెనీ, రామ్ ఆచంట, గోపీ ఆచంట వంటి నిర్మాతలతో మళ్లీ మళ్లీ పని చేయాలని కోరుకుంటున్నాను.



## క్లైమాక్స్‌లో నాగబంధం

**ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):**

యంగ్ హీరో విరాట్ కర్ణ, అభిషేక్ నామా దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న పాన్ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'నాగబంధం'తో అలరించబోతున్నారు. నాగబంధం డివైన్, యాక్షన్, అద్భుతమైన విజువల్ ఫీస్ట్ తో ఒక మ్యాసివ్ సినిమాటిక్ వండర్ గా రూపొందుతోంది. ప్రస్తుతం టీం నానక్‌రామగూడలోని రామానాయుడు స్టూడియోలో గూస్‌బంప్స్ పుట్టించే క్లైమాక్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తోంది. ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ అనుభూతిని అందించేందుకు మేకర్స్ భారీగా ఖర్చు చేస్తున్నారు. కేవలం క్లైమాక్స్ కోసమే 20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇప్పటివరకు నిర్మించిన అత్యంత ఖరీదైన క్లైమాక్స్ సీక్వెన్స్ లలో ఒకటిగా నిలుస్తోంది. ఓ మహాద్వారం చుట్టూ రూపుదిద్దుకున్న ఈ క్లైమాక్స్ సెట్ కథలోని భావోద్వేగం, డ్రామా విజువల్‌గా అద్భుతంగా చూపించేలా డిజైన్ చేశారు. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ తన బృందంతో కలిసి సెట్లోని ప్రతి అంశాన్ని అత్యున్నత ప్రమాణాలతో నిర్మించి, కథనం స్థాయిని మరింతగా పెంచేలా కేర్ తీసుకున్నారు. అద్భుతమైన యాక్షన్‌కు ప్రసిద్ధిగాంచిన థాయ్ స్టంట్ మాస్టర్ కేచా ఖాంఫాక్‌డీని టీం ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఆయన బెర్త్ టేకింగ్ యాక్షన్ కొరియోగ్రఫీతో సీక్వెన్స్ ని గ్రాండ్ గా తీర్చిదిద్దితున్నారు. ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసే స్టంట్స్, యాక్షన్ సన్నివేశాలతో ఈ సీక్వెన్స్ అద్భుతంగా, విజువల్‌గా మైండ్ బ్లోయింగ్ గా వుండబోతోంది. నాగబంధంలో నభా నటేష్ , ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు, జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమా కథ భారతదేశంలోని ప్రాచీన విష్ణు ఆలయాల నేపథ్యంపై సాగుతుంది.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**